


- వరప్రదాయిని సాకారంపై రైతుల నమ్మకం
- అటకెక్కిన గోదావరి జలాల తరలింపు పథకం
- ఐదేళ్లుగా వివక్ష చూపారని సీఎం జగన్‌పై ఆగ్రహం
- సాగర్ ఆయకట్టులో సాగు సంక్షోభమైనా పట్టని పాలకులు
- 9.61 లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా పథకంపై నిర్లక్ష్యం

9.61 లక్షల ఎకరాలకు సాగునీరు.. 679 చెరువులు, వందల గ్రామాలకు తాగునీరు.. సాగర్ ఆయకట్టులో తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా.. గోదావరి జలాలను సాగర్ ఆయకట్టు తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఎత్తి పోతల పథకానికి శ్రీకారం చుట్టింది. అయితే వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత వరప్రదాయిని లాంటి పథకంపై వివక్ష చూపింది. ఐదేళ్లుగా సీఎం జగన్‌మోహనరెడ్డి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా పనులు నిలిపివేశారు. పైగా వైఎస్ఆర్ పల్నాడు కరవు నివారణ పథకంగా పేరు మార్చారే కాని పనులపై దృష్టి సారించలేదు. ఈ పరిస్థితుల్లో మళ్లీ చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తేనే గోదావరి జలాలు సాగర్ ఆయకట్టుకు వస్తాయని.. తమకు నీటి కష్టాలు తీరతాయని రైతులు, గ్రామీణులు విశ్వసిస్తున్నారు.

చంద్రన్నతోనే.. గోదావరి!

3,437 ఎకరాల భూసేకరణ చేయాలి

పథకం పనుల కోసం 3,437 ఎకరాల భూమి అవసరమవుతుందని అంచనా వేశారు. ఇందుకు సంబంధించిన సర్వే కూడా పూర్తి చేశారు. అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, రాజుపాలెం మండలాల నుంచి నకరికల్లు మండలంలోని సాగర్ కుడి ప్రధాన కాలువ వరకు భూసేకరణకు రూ.955 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. భూసేకరణకు సంబంధించిన ప్రకటనను కూడా రెవెన్యూ శాఖ జారీ చేసింది. ఇందుకు నిధులు విడుదల కాకపోవడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఎత్తిపోతల పథకం పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది. రూ.2281 కోట్లతో ఒక ప్యాకేజీ, రూ.2655 కోట్లతో రెండో ప్యాకేజీగా నిర్ణయించి ఇద్దరు కాంట్రాక్టర్లకు పనులు ఇచ్చారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టలేదు. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయకుండా నిలిపివేయడంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఎత్తిపోతల పథకానికి నాటి సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణమ్మలో బిరబిరా పరుగులు లేవు. ఆయకట్టులో బంగారు పంటల ఆనవాళ్లు లేవు. నాగార్జునసాగర్ జలాశయం లో జలకళ లేదు. సాగునీటి కష్టాలతో ఆయకట్టు అల్లాడుతోంది. లక్షల ఎకరాల్లో రైతులు నీటి తడుల కోసం తంటాలు పడుతున్నారు. పంటల సాగు సందిగ్ధంలో పడింది. ఈ పరిస్థితిని గత టీడీపీ ప్రభుత్వం ముందస్తుగానే ఊహించి సాగర్ ఆయకట్టులో సాగు, తాగునీటి కష్టాలను శాశ్వతంగా పరిష్కరించేలా గోదావరి జలాలను తరలించే పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం సాగర్ ఆయకట్టుకు వరప్రదాయినిగా రూపొందించింది. అప్పటి సీఎం చంద్రబాబు నిధులు కేటాయించి శంకుస్థాపన కూడా చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వరప్రదాయనిలాంటి పథకంపై వివక్ష చూపింది. భూ సేకరణ సహా ఇతర పనులన్నింటినీ అటకెక్కించింది. సాగర్ కుడి కాలువ ఆయకట్టుకు వరప్రదాయనిగా నిలిచే పథకంపై ప్రభుత్వం శీతకన్ను వేయడంపై పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లావాసుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఈ పథకం పట్ల జగన్ వ్యవహరించిన తీరును అన్నదాతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఐదేళ్ల సీఎం జగన్‌మోహనరెడ్డి రూపాయి కూడా ఖర్చు చేయకుండా పనులు నిలిపివేయడంపై మండిపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వస్తేనే గోదావరి జలాలు సాగర్ ఆయకట్టు వస్తా యని రైతులు బలంగా విశ్వసిస్తున్నారు. ఆయనే అధికారంలోకి రావాలని అన్నదాతలు కోరు కుంటున్నారు.

ఎనిమిదేళ్లలో మూడేళ్లు కరువు

ఎనిమిదేళ్లలో మూడు సంవత్సరాలు సాగర్ ఆయకట్టులో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కుడి కాలువకు గోదావరి జలాలు అందుతాయన్న భరోసా నాలుగు జిల్లాల ప్రజల్లో సన్నగిల్లుతున్నది. గోదావరి జలాల తరలింపు పథకంతో పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో 9,61231వేల ఎకరాలకు సాగునీరు, 679 చెరువులకు తాగునీరు అందించేలా గోదావరి జలాల ఎత్తిపోతల పథకం రూపొందించారు. పట్టిసీమ పథకం ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు సరఫరా చేస్తుండటంతో ఆ ప్రాంతంలో రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడింది. ఇదే తరహాలో సాగర్ కుడి కాలువ ఆయకట్టుకు కూడా గోదావరి జలాలతో మహర్దశ పట్టేది. కుడి కాలువ ప్రాంతానికి గోదావరి, పెన్నా అనుసంధానం పథకం పూర్తి జీవం పోస్తుంది. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ పథకంపై వివక్ష చూపింది. దీంతో సాగర్ ఆయకట్టులో సాగునీటి సంక్షోభవంతో రెండేళ్లుగా పంటలు పండని పరిస్థితి నెలకొంది. అదే ఈ పథకం పూర్తి చేసి ఉంటే గోదావరి జలాలతో పంటలు పండేవని రైతుల అభిప్రాయం. ఈ ఎత్తిపోతల పథకం పూర్తి చేయటం ద్వారా రోజుకు ఏడు వేల క్యూసెక్కుల నీళ్ల కుడి కాల్వకు అందేవి. ఈ పథకం పూర్తయితే ఆయకట్టులో సాగు చిత్రం పూర్తిగా మారేదని కానీ వైసీపీ ప్రభుత్వ తీరు తమకు శాపంలా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- గోదావరి జలాలు నాగార్జున సాగర్ కుడి కాల్వలో కలిసే ప్రదేశం ఇదే

పేరు మార్చి పట్టించుకోలేదు..

గోదావరి జలాల తరలింపు పథకానికి తన తండ్రి వైఎస్ఆర్ పేరు పెట్టుకోవడంలో ముఖ్యమంత్రి కాగానే జగన్ చూపిన శ్రద్ధ పథకం నిర్మాణంపై కనబరచలేదు. టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన ఎత్తిపోతల పథకం పనులను జగన్ నిలిపేశారు. ఈ పథకం నిర్మాణానికి రూ.6,020 కోట్లు నిధులు కేటాయించినట్లు 2020లో ప్రభుత్వం ప్రకటించింది. అయితే నిధుల విడుదలను జగన్ ప్రభుత్వం విస్మరించింది. దీంతో భూసేకరణ నిలిచిపోయింది. పంపుహౌస్ నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు నిలిపివేశారు. పథకం నిర్మాణానికి భూసేకరణ ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందాన మారింది. ఐదేళ్లుగా పనులు ముందుకు సాగకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబుతోనే సాకారం

గోదావరి పెన్నా నదుల అనుసంధానం ఆంధ్రప్రదేశ్ వరప్రదాయని. దశాబ్దాల కలది. ఆంధ్రప్రదేశ్ విభజనతో నీటి సంక్షోభ ప్రమాదాన్ని చంద్రబాబు ఊహించారు. విభజిత రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను నాగార్జున సాగర్ ఆయకట్టుకు తరలించాలని నిర్ణయించారు. గోదావరి జలాల తరలింపు ద్వారా సాగర్ కుడి కాల్వ ఆ యకట్టులో నెలకొనే సాగు నీటి సంక్షోభానికి శాశ్వత పరిష్కారంగా గుర్తించారు. దీంతో 2018లో నకరికల్లు వద్ద గోదావరి జలాలను సాగర్‌కు తరలించే ఎత్తిపోతల పథకానికి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అయితే ప్రభుత్వం మారడంతో ఈ పథకం మూలనపడింది. పైగా ఈ పథకానికి సీఎం జగన్ తన తండ్రి పేరుతో వైఎస్ఆర్ పల్నా డు కరవు నివారణ పథకంగా మార్చారే కాని ఐదేళ్లగా పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో రానున్న ఎన్నికల్లో మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ఆయన శంకుస్థాపన చేసిన పథకం పూర్తి అవు తుందని.. తమ నీటి కష్టాలు తీరతా యని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు.



గతేడాది ఫిబ్రవరిలో తెనాలిలో సీఎం జగన్ హామీలు ఇస్తుండగా చప్పట్లు కొడుతున్న ఎమ్మెల్యే శివకుమార్ (పాతచిత్రం)

- ముఖ్యమంత్రి హోదాలో మాటిచ్చి 14 నెలలు
- ఒక ఎమ్మెల్యే స్థాయిలో చేసే హామీలనే గొప్పగా చెప్పుకున్నావ్!
- 5 పనులకు నువ్విస్తానంది రూ.43 కోట్లే... అదీ నీటిమూటే
- ఆంధ్రాప్యారిస్ కాల్వల సుందరీకరణా కలగానే

వరాలిచ్చావు.. గుర్తుందా?

తెనాలి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఆయన ముఖ్యమంత్రి... 14 నెలల క్రితం తెనాలి నియోజకవర్గానికొచ్చారు. మీ తెనాలికి వరాల జల్లు కురిపిస్తున్నానన్నారు. మీ ఎమ్మెల్యే శివ అడిగాడు కాబట్టి అన్నీ మంజూరు చేసేస్తున్నానన్నారు. ఇదంతా విన్న జనానికి అబ్బో సీఎం ఎన్ని వందల కోట్లు ఇచ్చేస్తారోనని సంబరపడ్డారు. ఆయన మాటిచ్చారంటే తప్పరని ఒకరికొకరు చెప్పుకుని ఆనందపడిపోయారు. ఒక్కోటి చదవటం మొదలు పెట్టగానే ఇవా ఒక సీఎం హోదాలో మీరిచ్చేదంటూ పెదవి విరిచారు. ఇదంతా 2023 ఫిబ్రవరి 28న జరిగిన ఈ హామీల పండుగకు సంబంధించి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాకపోవటం ఆయన పనితీరుకు నిదర్శనం. ఈయన హామీల గొప్పలు విని మోసపోయినవారిలో ఎస్సీ, మైనారిటీలు, కొల్లిపర మండల రైతులు, తెనాలి పట్టణ వాసులున్నారు. గతేడాది ఫిబ్రవరి 28 తెనాలిలో రాష్ట్రంలోని రైతులకోసం ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా మొత్తాలను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు మీట నొక్కే కార్యక్రమానికి సీఎం జగన్ వచ్చారు. సభలో మాట్లాడిన తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెనాలికి కొన్ని అవసరాలున్నాయని, వాటికి నిధులు మంజూరు చెయ్యాలంటూ కొన్ని అంశాలను ప్రస్తావించారు. జగన్ ప్రసంగం చివర్లో వీటిపై స్పందించారు.

ఎస్సీ, మైనారిటీలను దగాచేసి...

ఎస్సీ కాలనీల్లో శ్మశాన స్థలాల కోసం రూ.9 కోట్లు ఇస్తామన్నారు కానీ ఒక్క రూపాయి ఇచ్చింది లేదు. గతంలో ఎస్సీ సామాజిక వర్గం జగన్ ప్రభుత్వ వస్తే తమకు మేలు జరుగుతుందని, తమ కాలనీలు అభివృద్ధి చెందుతాయని సంతోషపడ్డారు. కానీ చివరకు శ్మశాన స్థలాలకు నిధులు కూడా విడుదల చెయ్యలేకపోయింది. మరోపక్క ముస్లిం సామాజిక వర్గంలోని అన్ని కుటుంబాలు తమ పిల్లల వివాహాలకు షాదీఖానా లేక అవస్థలు పడుతున్నారు. పట్టణంలో దీని నిర్మాణం కోసం రూ.4 కోట్లు ఇస్తానని చెప్పినా ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. దాతల సహకారంతో కొంతవరకు భవనం నిర్మాణం జరిగినా, మధ్యలోనే నిధులు లేక ఆగిపోయింది. కొల్లిపర మండలంలో ఆ పార్టీ సామాజిక వర్గం ఎక్కువగా ఉన్నా, దీనికి మించి రైతులు ఎక్కువ. వీరు పండించిన వాణిజ్య పంటలను అమ్ముకోవాలంటే అరటి, ఇతర వాణిజ్య పంటలకు మార్కెట్ లేదు. వరి, మొక్కజొన్న పండించినా, గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ ఉంచుకునేందుకు గోదాములూ లేవు. దీనికోసమే గతంలో ఈ ప్రాంతంలోని రైతులు ఒక మార్కెట్ యార్డు అవసరమని కోరారు. దీనికి సంబంధించిన భూమి కొనుగోలుకు రూ.5కోట్లు ఇచ్చేస్తున్నట్టు సీఎం చెప్పారు. ఒక్క పైసా విడుదల కాక స్థల సేకరణ కూడా జరగలేదు. దుగ్గిరాల-కొల్లిపర మధ్య రోడ్డు సింగిల్ రోడ్డు కావటం, పసుపును యార్డుకు తీసుకెళ్లాలన్నా, రాజధాని ప్రాంతానికి దగ్గర దారిగా రావాలన్నా ఈ రోడ్డు ఉపకరిస్తుంది. దీనిని డబుల్‌లైన్ రోడ్డుగా వెడల్పు చేసి, అభివృద్ధి పరిచేందుకు రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. అయితే దీని నిధుల ఊసేలేదు. మార్కెట్ సెంటర్‌లో మున్సిపల్ భవనం నిర్మాణం కోసం రూ.15కోట్లు మంజూరు చేసేస్తున్నామన్నారు. అవీ అతీగతీలేదు. మొత్తంమీద ఆయన చేసిన హామీల విలువ రూ.43 కోట్లే. కానీ 40 పైసలు కూడా అందలేదు.



అప్పటి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ వేసిన శిలాఫలకం

ఎమ్మెల్యేకే తక్కువ.. మరి సీఎంకో?

అప్పటి బటన్ నొక్కుడు సభలో జగన్ మంజూరు చేస్తున్నట్టు ప్రకటించిన మొత్తం నిధుల విలువ కేవలం రూ.43కోట్లే. ఇవి ఒక ఎమ్మెల్యే తన నిధులతో చేయదగినవే. కానీ సాక్షాత్తు ఆ దేవుడే వరమిచ్చినట్టు చెప్పారు. అంటే ఒక ఎమ్మెల్యేకు ఆ మాత్రం నిధులు కూడా ఈ ఐదేళ్లలో విడుదల కాలేదనేది అర్థమవుతుందంటూ ప్రతిపక్షాలు చాలాసార్లు దుమ్మెత్తి పోశాయి. అంటే అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో సాధారణ నిధులు మినహా ముఖ్యమంత్రి స్థాయిలో మంజూరు చేసిన పెద్దమొత్తాలు లేనేలేవు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి నెలలోనే తెనాలి-రేవేంద్రపాడు మధ్య నాలుగు లైన్ల రహదారి నిర్మాణం కోసం రూ.264 కోట్లు మంజూరు చేసినట్టు స్థానిక నేతలు ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఇంతవరకు ఆ నిధులు ఏమయ్యాయో! పనులు ఇంతవరకు ఎందుకు మొదలు కాలేదో చెప్పేవారే లేరు. పట్టణంలో భూగర్భ డ్రెయినేజి నిర్మాణం హామీ దశాబ్దాలుగా మూలనపడుతూనే వస్తోంది. దీనికి రూ.200కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనావేసి, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే నిధులకోసం నేతలు ప్రయత్నిస్తే ఇవ్వలేమనకుండా, మీ దగ్గర మట్టి దీని నిర్మాణానికి పనికిరాదని, ఒకవేళ అంత ఖర్చుచేసి నిర్మించినా భూగర్భంలో వేసిన పైప్ లైన్లు దెబ్బతినిపోతాయని సాకుగాచెప్పి నిధులు మంజూరుకు మొండిచెయ్యి చూపారు.

జగనన్న ఇచ్చిన వరాలివే..

తెనాలి నియోజకవర్గంలో ప్రజలకు అంతా మంచి జరగాలని, మీరు కోరినవన్నీ ఇచ్చేస్తున్నానంటూ సీఎం జగన్ అప్పట్లో గొప్పగా చెప్పారు. తెనాలిలో ఎస్సీ కాలనీ వాసులకు శ్మశాన స్థలాల కొనుగోలుకు రూ.9 కోట్లు కావాలని మీ శివ అడిగారు వెంటనే ఆ నిధులు శాంక్షన్ చేస్తున్నానంటూ జగన్ మాటిచ్చారు. షాదికానాలకు రూ.4 కోట్లు కావాలని అడిగాడు ఇచ్చేస్తున్నా. కొల్లిపరలో మినీ వ్యవసాయ మార్కెట్ యార్డు ఉంటే రైతులకు మేలు జరుగుతుందని, దీనికి అవసరమైన స్థలం కోసం రూ.5కోట్లు మంజూరు చేసేస్తున్నా. దుగ్గిరాల-కొల్లిపర రోడ్డు విస్తరణకు రూ.10కోట్లు, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.15కోట్లు కావాలన్నాడు అవికూడా వెంటనే ఇచ్చేస్తున్నా అంటూ ఆయన భారీ నిధులు మంజూరు చేస్తున్నట్టు గొప్పగా చెబుతుంటే ఆయన పక్కనే వేదికపై ఉన్న ఎమ్మెల్యే శివ కుమార్ కూడా చప్పట్లు కొట్టారు. ప్రతి అంశానికీ ఇచ్చేస్తున్నానంటూ చెప్పి ఆయన తలపై చేయిపెడుతూ దీవెనలిచ్చారు. అప్పట్లో ఈ దృశ్యాలు చూసిన జనం విదిల్చింది తక్కువే అయినా అవన్నా వస్తే చాలులే అనుకున్నారు. కానీ ఈ మాటలు చెప్పి ఏకంగా 14 నెలలు దాటిపోతోంది. సాక్షాత్తు ముఖ్యమంత్రి చెప్పినవాటికి కూడా దిక్కులేకుండా పోయిందంటే చేసిన అభివృద్ధి ఏమేర ఉందనేది అర్థమవుతుందంటూ జనం ఇప్పటికీ శాపనార్థాలు పెడుతూనే ఉన్నారు.

వార్డెన్లు.. అప్పులపాలు

- అప్పుల ఊబిలో హాస్టళ్ల నిర్వాహకులు
- 8 నెలలుగా బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- వసతి గృహాలకు రూ.20 కోట్లకుపైగా బకాయి
- బిల్లులు రాక.. అప్పులు చెల్లించలేక వార్డెన్లు సతమతం
- హాస్టళ్లకు సెలవులతో సంక్షేమాధికారులపై దుకాణదారుల ఒత్తిడి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎస్సీ వసతి గృహంలో 60 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు ప్రభుత్వం భోజన బిల్లు కింద రూ.1400 చెల్లించాలి. ఇలా నెలకు 84,000 చెల్లించాలి. ఎనిమిది నెలలుగా బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. అంటే ఆ వసతిగృహానికి రూ.6,72,000 బిల్లు చెల్లించాలి. ఆ వసతి గృహం నిర్వహకుడు ఈ మొత్తం అప్పు చేశారు. చిల్లర కొట్టులో కూడా బాకీ పేరుకుపోయింది.

ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల్లోని పరిస్థితి. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోయినా విద్యార్థుల ఆకలి చూడలేక వార్డెన్లు అప్పులతో సరుకులు కొనుగోలు చేసి హాస్టళ్లను ఎనిమిది నెలలుగా నిర్వహించారు. లక్షలకు లక్షలకు అప్పులు చేసి వసతి గృహాల నిర్వాహకులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఎప్పటికైనా బిల్లులు వస్తాయి దుకాణదారులకు చెల్లించవచ్చని వార్డెన్లు భావించారు. బటన్ నొక్కి లక్షల కోట్లు ప్రజలకు పంచిపెట్టానని చెబుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వసతిగృహాల బిల్లులకు మాత్రం బటన్ నొక్కలేదు. ఈ విద్యా సంవత్సరానికి మంగళవారం చివరి రోజు. దీంతో పాఠశాలలతో పాటు హాస్టళ్లకు కూడా సెలవులు. ఈ పరిస్థితుల్లో బిల్లుల వ ం జూ రుపై వార్డెన్లలో ఆందోళన నెలకొంది. వసతి గృహాలకు సెలవులు ఇచ్చేలోపు తమ అప్పులు తీర్చాలని రుణదాతలు వార్డెన్లపై ఒత్తిడి చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు రూ.20 కోట్లకు పైగా బిల్లుల బకాయిలు పేరుకు పోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వసతి గృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఎనిమిది నెలలుగా వసతి గృహాల బిల్లులు ప్రభుత్వం విడుదల చేయలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీలపై జగన్‌కు ఎంత ప్రేమ ఉందో వసతి గృహాల నిర్వహణ తెలియజేస్తోంది.



నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

60 శాతం నిధులు ఏమైనట్లు?

వసతి గృహాల నిర్వహణ నిధుల్లో 60 శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో బిల్లులు చెల్లించలేని దుస్థితి ఏర్పడిందని సమాచారం. వసతి గృహాలను రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడిగా నిర్వహిస్తున్నదన్న విమర్శలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో వసతి గృహాల నిర్వాహకులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో వార్డెన్లు ఆర్థిక వేతలు ఎదుర్కొంటున్నారు. కూరగాయలు, సరుకులు, గ్యాస్, పాలు అప్పులకు కొనుగోలు చేసి ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు దుకాణదారులకు చెల్లించే వారు. అయితే సెప్టెంబరు నుంచి ఎనిమిది నెలలుగా ఆ బిల్లులు విడుదల కాలేదు. దీంతో కొన్నిప్రాంతాల్లో వార్డెన్లుకు అప్పు దొరకని పరిస్థితులు కూడా నెలకొన్నాయి. అయినా అష్టకష్టాలు పడి వసతిగృహాలను నిర్వహించారు. పాఠశాల విద్యార్థికి నెలకు రూ.2,200 ఖర్చు అవుతుంటే ప్రభుత్వం రూ.1,400 చెల్లిస్తోంది. కూరగాయలు, నూనె, గ్యాస్ అన్నింటి ధరలు భారీగా పెరిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం బడ్జెట్ పెంచకపోయినా ఎలాగోలా విద్యార్థులకు వార్డెన్లు ఆహారం అందించారు. అయినా వార్డెన్ల అవస్థలను పట్టించుకోని ప్రభుత్వం బిల్లుల మంజూరులో తాత్సారం చేస్తూ వస్తోంది. సెలవుల నేపథ్యంలో తమ బిల్లులు విడుదల చేయాలని వార్డెన్లు అభ్యర్థిస్తున్నారు.

సూపర్ సిక్స్‌తో మహిళలకు ఆర్థిక భరోసా

- మంగళగిరి ఎన్నికల ప్రచారంలో నారా బ్రాహ్మణి
- ఎర్రబాలెంలో సంధ్య స్పైసెస్ కంపెనీ సందర్శన
- మహిళల సాధకబాధకాలు తెలుసుకున్న బ్రాహ్మణి

8లో..



ఎర్రబాలెం సంధ్య స్పైసెస్ కంపెనీలో మహిళలతో మాట్లాడుతున్న బ్రాహ్మణి



మైనార్టీ మహిళలతో బ్రాహ్మణి, పెమ్మసాని శ్రీరత్న

పెమ్మసానిని దూషించిన వ్యక్తిని
తక్షణమే అరెస్టు చేయాలి

● మేడికొండూరు పోలీసుస్టేషన్‌లో
కేసు నమోదు చేయాలని టీడీపీ నేతల డిమాండ్


పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మేడికొండూరు ఏప్రిల్20: గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని తెలుగుదేశం నాయకులు డిమాండ్ చేశారు. డాక్టర్ పెమ్మసానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి మేడికొండూరు మండలం మంగళగిరిపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించిన స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఏకమై శనివారం రాత్రి మేడికొండూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని కేసు నమోదు చేయాలని ఆందోళన చేశారు. దూషణకు పాల్పడి యువకుడు మంగళగిరిపాడుకు చెందిన వ్యక్తి కావున మేడికొండూరు పోలీసులు ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేయాలని వారు కోరారు. అయితే ఘటన జరిగింది గుంటూరు నగరంలో కనుక అక్కడి స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సీఐ దార్ల జయకుమార్ తెలుగుదేశం నాయకులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న వారిలో ఎక్కువశాతం మంది మంగళగిరిపాడుకు చెందిన ముస్లిం నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. వారితోపాటు గుంటూరు పార్లమెంట్ టీడీపీ మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్ ఘని, మాజీ జడ్పీటీసీ గుంటుపల్లి సాంబశివరావు, మాజీ ఎంపీపీ మొక్కల సుబ్బారావు తదితరులు ఉన్నారు. కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎక్కువమంది పోలీస్ స్టేషన్ గుమికూడదని పోలీసులు తెలియజేయడంతో వాళ్లంతా గుంటూరులో ఫిర్యాదు చేసేందుకు వెళతామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ సహేతుక విమర్శలు చేయవచ్చునని, దూషణకు పాల్పడడం సరైంది కాదని హితవు చెప్పారు. వైసీపీ నాయకులు వెనుక ఉండి ఇటువంటి వాఖ్యలు చేయిస్తున్నారని వారు ఆరోపించారు.

చంపుతానని పెమ్మసానికి బెదిరింపులు : యువకుడిపై కేసు

గుంటూరు, ఏప్రిల్ 20 : గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను చంపుతానని బెదిరించిన మేడికొండూరు మండలం తురకపాలెం గ్రామానికి చెందిన ఆలీ, మరికొందరు యువకులపై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదయింది. శనివారం గుంటూరు పశ్చిమ వైసిపి అభ్యర్థి విడుదల రజిని నామినేషన్ దాఖలు సందర్భంగా జరిగిన ర్యాలీలో మేడికొండూరు మండలం తురకపాలెం గ్రామం నుంచి ఆలీతో పాటు అనేకమంది యువకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ యూట్యూబ్ ఛానల్ తో ఆలీ మాట్లాడుతూ జగన్ మళ్ళీ సీఎం అవుతారని, ఆయన సీఎం కాగానే గుంటూరు టిడిపి పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను చంపేస్తానని హెచ్చరించాడు. ఇటీవల అతని ఎన్నికల ప్రచారంలో సద్దాం హుస్సేన్ పట్ల ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారని అందుకు నిరసనగా పెమ్మసానిని చంపేస్తానని తీవ్ర స్థాయిలో బెదిరించాడు. అంతేగాక టిడిపి అధినేత చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పైన ఆలీ అనుచితంగా వ్యాఖ్యలు చేశాడు. పవన్ కళ్యాణ్ ను కూడా చంపుతానని బెదిరించాడు. అయితే సద్దాం హుస్సేన్ పట్ల తాను చేసిన వ్యాఖ్యలపై డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెంటనే క్షమాపణ చెప్పారు. అయినప్పటికీ కేవలం రాజకీయ దురుద్దేశంతో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను చంపాలని ప్రయత్నం జరుగుతున్నట్లు కోబాల్ట్‌పేటకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు పఠాన్ హజ్మతుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు పలు సెక్షన్ల కింద ఆలీపై కేసు నమోదు చేశారు. న్యాయ సలహా అనంతరం పలు సెక్షన్లు చేర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీలోకి వెయ్యి కుటుంబాలు చేరిక

● వైసీపీని వీడి భారీగా వలసలు..
● పసుపు కండువాలు కప్పి ఆహ్వానించిన యరపతినేని


టీడీపీలో చేరిన జానపాడు సర్పంచ్ మర్యాదరావుతో యరపతినేని

పిడుగురాళ్ల, ఏప్రిల్ 20: గురజాల నియోజకవర్గంలో టీడీపీలోకి భారీగా వలసల వరదలా జరుగుతున్నాయి. శనివారం పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి మండలాలకు చెందిన వారే కాకుండా గురజాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, ప్రస్తుత సర్పంచ్‌లు, సొసైటీ ఛైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపిటిసిలు పిడుగురాళ్లలో గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావును కలిసి మద్దతు తెలిపారు. అనంతరం టీడీపీలో చేరిన వారందరికీ యరపతినేని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జానపాడు సర్పంచ్ తాళ్లపోగు మర్యాదరావు, సొసైటీ ఛైర్మన్ వున్నం శ్రీను, మాజీ ఉపసర్పంచ్ తాళ్లపోగు గంగాధర్, యూత్ లీడర్లు జగదీష్, దిలీప్, ముసలయ్య, సాతులూరి పెదశ్రీనుతో పాటు మరో 120 కుటుంబాలకు పైగా టీడీపీలో చేరారు. అదేవిధంగా వీరాపురం గ్రామానికి చెందిన జనసేన సర్పంచ్ అభ్యర్థి కాశిక బుల్లయ్య, నీలంశెట్టి రాజా, పర్చూరి రవీంద్రబాబు, గుమ్మడి మురళీ, సైదులు, మరో 25 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. మాచవరం మండలంలోని రేగులగడ్డకు చెందిన ఎస్సీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన బత్తుల ఏసయ్య, ఉప్పాళ్ల నరసింహారావు, పప్పుల ప్రభాకర్, సింగడాల వెంకట్రామయ్యతో పాటు మరో 20 కుటుంబాల వారు టీడీపీలో చేరటం జరిగింది. గోవిందాపురంలోని వివిధ సామాజికవర్గాలకు చెందిన తలారి సైదయ్య, సోమరాజు వెంకటేశ్వర్లు, కాశయ్య, తాళ్లూరి నిత్యానందచారితో పాటు మరికొందరు టీడీపీలో చేరారు. పిడుగురాళ్ల పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు అలపర్తి నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ చల్లగుండ్ల సంతోషరావు, కందుకూరి దావీదు, పత్రా ఏసుదానం, గద్దల తిరుపతయ్య, పసుపులేటి విజయకుమార్, మందా స్వామి, రాజేష్‌తో పాటు మరో 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరటం జరిగింది. గురజాల మండలం జంగమహేశ్వరపురం, చర్లగుడిపాడు, గంగవరం, మాడుగుల, సమాధానం పేట, గురజాల పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన 250 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయా కార్యక్రమాలలో జడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, వున్నం నరసింహారావు, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, వున్నం వెంకటరావు, వున్నం శ్రీను, పసుపులేటి నరసింహారావు, యర్నాన రామకృష్ణ, ముప్పాళ్ల సాంబయ్య, పాండురంగ శ్రీను, తురకా వీరస్వామి, సయ్యద్ అమీర్‌అలి, షేక్ బాబావలి, తదితరులు పాల్గొన్నారు.


కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో చేరిన వైసీపీ కౌన్సిలర్ శ్రీనివాసరావు

టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్

● పార్టీలోకి ఆహ్వానించిన కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి ఏప్రిల్ 20: పట్టణంలోని 19వ వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు శనివారం సాయంత్రం టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనకు కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు మరికొంతమంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యెలినేడి రామస్వామి ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్‌బాషా జానీబాబు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరవకట్టలో కార్డెన్ సెర్చ్

● 60 మోటారు సైకిళ్ళు.. మూడు ఆటోలు స్వాధీనం
● అదుపులో ముగ్గురు రౌడీషీటర్లు


తనిఖీ చేస్తున్న సీఐ కృష్ణారెడ్డి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 20: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పట్టణంలోని వరవకట్టలో ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ నేతృత్వంలో శనివారం తెల్లవారు జామున 4:30 గంటల నుంచి ఉదయం 7:30 గంటల వరకు మొదటి పట్టణ పోలీసు స్టేషన్ పక్కన గల వరవకట్టకు నాలుగు మూలల పోలీసులు గుమ్మికూడి జల్లెడ పట్టారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 60 మోటారు సైకిళ్ళు మూడు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. షేక్ కాలేషా వలి ఎలియాస్ వరవకట్టబాబు, షేక్ సుభానీ, ఎలియాస్ బ్లాకీ, షేక్ సుభానీ అలియాస్ సమోసాలను అదుపులోకి తీసుకున్నట్టు మొదటి పట్టణ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి తెలిపారు. తనిఖీల్లో రెండవ పట్టణ సీఐ భాస్కర్, రూరల్ సీఐ మల్లిఖార్జునరావు, ఎస్ఐలు మణికృష్ణ, సతీష్ అశోక్, రోశయ్య, బీఎస్ఎఫ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

రాజధాని విచ్ఛిన్నకారులను ఓడించండి

● 1586వ రోజుకు ఆందోళనలు ..


వెంకటపాలెం శిబిరంలో మహిళల నిరసన

తుళ్ళూరు, ఏప్రిల్ 20: రాజధాని అమరావతి అభివృద్ధిని విస్మరించి, విచ్ఛిన్నానికి పాల్పడిన వైసీపీని ఓడించాలని 33 వేల ఎకరాల భూములు త్యాగంచేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1586వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి వారు మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధానిని నిర్వీర్యంచేసిన వారిని ఓడించటమే ధ్యేయంగా ప్రజలున్నారని రైతులు స్పష్టంచేశారు. జగన్‌రెడ్డి ఆడుతున్న డ్రామాలను ప్రజలు నమ్మవద్దని విన్నవించారు. అమరావతి నాశనం చేయటమే ఐదేళ్ల పాలనంతా సరిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు నిరసనలు కొనసాగాయి.



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వలంటీర్ దుర్గా, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి

ఎన్నికల ప్రచారంలో వలంటీరు

వినుకొండటౌన్, ఏప్రిల్ 20: పట్టణంలోని 14వ వార్డులో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో అంగన్‌వాడీ కార్యకర్త కొలకలూరి జ్యోతితోపాటు వలంటీర్ పందుల దుర్గ ఎమ్మెల్యేతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఇదే తరహాలో 14వ వార్డులో అంగన్‌వాడీ కార్యకర్తతోపాటు వలంటీర్ ప్రచారంలో పాల్గొని ఏకంగా బ్రహ్మనాయుడుకు శాలువాలతో సత్కరించిన దృశ్యాలను తెలుగుదేశంపార్టీ నాయకులు రిటర్నింగ్ అధికారి సుబ్బారావుకు చూపి ఫిర్యాదు చేశారు.

వల్లభాపురంలో మద్యం పట్టివేత


మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

కొల్లిపర, ఏప్రిల్ 20 : మండల పరిధిలోని వల్లభాపురంలో అక్రమంగా నిల్వవుంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెనాలి సెబ్ సీఐ వెంకటాచలం తెలిపారు. వల్లభాపురంకు చెందిన దొంతిరెడ్డి రామిరెడ్డి ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 80 బాటిల్స్ మద్యాన్ని శనివారం రాత్రి 9.30గంటల సమయంలో ఆకస్మిక దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈదాడుల్లో వల్లభాపురం చెందిన దొంతిరెడ్డి రామిరెడ్డి, అత్తలూరివారిపాలెంకు చెందిన దర్శి నాగరాజు, దర్శి రవితేజలను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కేసులో మరో నిందితుడు ప్రభుత్వం మద్యం షాపు సేల్స్‌మేన్ యడ్ల సునీల్‌ను అదుపులోకి తీసుకోవాల్సి ఉందని ఆయన తెలిపారు. వీరిపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలియజేశారు. అదే విధంగా వల్లభాపురంలో కూసం కృష్ణారెడ్డి ఇంటి వద్ద 5లీటర్లు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కొల్లిపర ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.

కమ్యూనిటీ స్థలాన్ని ఆక్రమించారు

● ఎమ్మెల్యే సుచరిత వద్ద వాపోయిన బూర్ల కాలనీ వాసులు

తాడికొండ, ఏప్రిల్ 20: తాడికొండలోని కొంత మంది వైసీపీ నాయకులు కమ్యూనిటీ స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే మేకతోటి సుచరిత వద్ద వాపోయారు. శనివారం రాత్రి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత ఎన్నికల ప్రచారంకు తాడికొండలోని బూర్ల కాలనీకి వచ్చారు. ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థిస్తున్న క్రమంలో కాలనీలోని కొంతమంది మహిళలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. 2005లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసిందని అప్పటి నుంచి ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొన జీవిస్తున్నామని పేర్కొన్నారు. కాలనీలో 16 సెంట్ల కమ్యూనిటి స్థలాన్ని కాలనీవాసులు అవసరాలకు వదిలి పెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామంలోని కొంతమంది వైసీపీ నాయకులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై కమ్యూనిటి స్థలానికి పట్టాలు పుట్టించుకున్నారని వాపోయారు. ప్రశ్నించే వారిపై దాడులకు దగుతూ కేసులు పెడుతూ కోర్టుల చుట్టు తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిటి స్థలాన్ని కాపాడి అభివృద్ధి చేయాలని కాలనీవాసులు వేడుకున్నారు. కమ్యూనిటీ స్థలంపై ఎమ్మెల్యేకు వివరిస్తున్న క్రమంలో మండల వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి కాలనీవాసులు చెప్పింది వాస్తమని చెప్పారు. సానుకూలంగా స్పందించిన సుచరిత అధికారంలోకి రాగానే కాలనీ వాసుల ఇష్టా ప్రకారం స్థలాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

కుడికాలువలో ఇద్దరు యువకుల గల్లంతు

● ప్రమాదం నుంచి బయటపడ్డ బాలిక
● జన్మదిన వేడుకలకు వచ్చి సరదాగా సెల్ఫీ దిగుతుండగా ఘటన

దుర్గి, ఏప్రిల్ 20: పుట్టినరోజు వేడుకలు జరుపుకొని సాయంత్రం సరదాగా నాగార్జున సాగర్ కుడి కాలువ వంతెనపై సెల్ఫీలు దిగుతూ జారిపడి ఇరువురు యువకులు గల్లంతైనఘటన అడిగొప్పుల వద్ద శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని అడిగొప్పుల గామంలో సచివాలయం - 2లో ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తున్న మస్తాన్‌బి కుమారుడు సోహెల్ (16), కుమార్తె అస్మద్‌తబస్సుస్, వీరి స్నేహితుడు గుంటూరు నెహ్రూనగర్‌కు చెందిన ఎస్‌కే యూసఫ్ (16)లు శనివారం అడిగొప్పులకు చేరుకున్నారు. సోహెల్ పుట్టినరోజు సందర్భంగా మస్తాన్‌బి గృహంలో కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. సాయంత్రం వేళ కుటుంబసమేతంగా కుడి కాలువ వద్దకు చేరుకున్నారు. అక్కడ బ్రిడ్జిపై సెల్ఫీలు దిగుతూ ప్రమాద వశాత్తూ సోహెల్, యూసఫ్, అస్మద్‌తభుస్సుస్‌లు కుడికాలువలో పడిపోయారు. గమనించిన తల్లి మస్తాన్‌బి స్థానికులతో కలిసి కుమార్తె అస్మద్‌తభుస్సున్‌ను నీటిని నుంచి బయటకు లాగి ఒడ్డుకు చేర్చారు. అప్పటికే సోహెల్, అతని స్నేహితుడు యూసఫ్‌లు నీటిప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. సీఐ చిన మల్లయ్య అక్కడకు చేరుకొని గత ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. కాగా పుట్టిన రోజున తన కళ్లముందే కుమారుడు, అతని స్నేహితుడు గల్లంతు కావడంతో తల్లి మస్తాన్‌బి రోదన మిన్నంటింది.

అనిల్‌యాదవ్‌ను బలిపశువు చేసిన జగన్

● ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దుర్గి, ఏప్రిల్ 20: అనిల్‌కుమార్ యాదవ్‌ను జగన్‌మోహన్‌రెడ్డి బలిపశువును చేసి, గెలవలేని నరసరావుపేట సీటును కేటాయించారని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రమైన దుర్గి షాదీఖానాలో బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన కుటుంబానికి అనేక పదవులిచ్చి ఆదుకున్నప్పటికీ బీసీలకు తాను ద్రోహం చేస్తున్నానని అనిల్‌కుమార్ యాదవ్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. 1994 నుంచి ప్రత్యక్షంగా రాజకీయాల్లో ఉన్నానని, తనకు పదవులు కొత్తేమీ కాదని, కాంగ్రెస్ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి రాజశేఖరరెడ్డి తనను పిలిచి మరీ గురజాల శాసనసభ అభ్యర్థిగా ప్రకటించారని చెప్పారు. 1985 నుంచి రెండు దఫాలుగా గురజాల శాసనసభ్యునిగా ఉన్నానని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి గురజాల శాసనసభ అభ్యర్థిగా ప్రకటిస్తూ పార్టీలో తనకు పెద్దపీట వేస్తానని హామీనిచ్చారని, ఎమ్మెల్సీ పదవి ఇస్తూ నియోజకర్గంలో తన మాట చెల్లకుండా చేశారని అన్నారు. సొంత కార్యకర్తలకు, నేతలకు అన్యాయం జరుగుతుంటే ఎన్నిమార్లు కాసు మహేష్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిల దృష్టికి తాను తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదని అన్నారు. సొంత పార్టీ నేతలే తనను అవమానించారని అన్నారు. రెడ్డి కుటుంబాలు ఎన్ని పదవులైనా చేయొచ్చు గానీ బీసీ కుటుంబాల్లో అర్హత ఉన్న నేతలు ఏ పదవీ చేయకూడదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం బీసీలపై పెట్టిన అక్రమ కేసులను టీడీపీ అధికారంలోకి రాగానే తొలగించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి సింగు నాగేశ్వరరావు, మున్నా రాంబాబు, గోళ్ల సురేష్, జనసేన జిల్లా కార్యదర్శి పులి హరి, మండల అధ్యక్షుడు తోటకూర శ్రీను, రుద్రాల రవి, బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు, ఎలీషాబాబు, షేక్ అల్లాబాషా, మాబాషా, బీసీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీ నేత నుంచి మద్యం బాటిళ్ల స్వాధీనం

నాదెండ్ల, ఏప్రిల్ 20 : మండలంలోని తూబాడు గ్రామానికి చెందిన వైసీపీ నేత కాసు చిన్నపరెడ్డి అనే వ్యక్తి నుంచి 160 మద్యం బాటిళ్ళను శుక్రవారం రాత్రి ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మోటారు బైక్ పై నాదెండ్ల నుంచి తూబాడు తీసుకు వెళ్తుండగా జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ఈబీ ఎస్ఐ బీ శశికుమార్ దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాసు చిన్నపరెడ్డిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

అమర్‌నాథ్ యాత్రికులకు
వైద్య పరీక్షలు

గుంటూరు (మెడికల్), ఏప్రిల్ 20: ఈ ఏడాది జిల్లా నుంచి అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ప్రతి మంగళ, గురు వారాల్లో వైద్యపరీక్షలు నిర్వహించి మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేస్తామని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రకు వెళ్లేందుకు 13 నుంచి 75 ఏళ్లలోపు వరకు మాత్రమే అర్హులని ఆయన తెలిపారు. వైద్యపరీక్షల కోసం వచ్చే యాత్రికులు తమ వెంట రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, అమర్‌నాథ్ యాత్ర మెడికల్ సర్టిఫికెట్ నమూనా, వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకొని రావాలని ఆయన సూచించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు

● ఇద్దరు యువకులు దుర్మరణం .. ఒకరికి గాయాలు

గుంటూరు, ఏప్రిల్ 20 : స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద పలుకులూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. నల్లపాడు సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపలకలూరుకు చెందిన ఖలియులుద్దీన్, సిద్ధిక్, జానీబాషలు శుక్రవారం రాత్రి గుంటూరు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అదే సమయంలో గుంటూరు వైపు నుంచి పెదపలకలూరు వైపు వెళ్తున్న కారు జేఎల్ఈ సినిమాస్ ఎదురుగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఆ తర్వాత మరో ఆటోనూ ఢీ కొట్టింది. ఆటో పక్కనే ఉన్న డ్రైనేజీలో పడింది. ఈ ప్రమాదంలో ఖలిలుద్దీన్ ఘటనాస్థలంలోని మృతి చెందగా సిద్ధిక్, జానీబాషాలను జీజీహెచ్‌కు తరలించారు చికిత్సపొందుతూ సిద్ధిక్ కన్నుమూశాడు. జానీ భాష రెండు కాళ్లు విరిగాయి. జానీబాషా తండ్రి షేక్ సుభానీ ఫిర్యాదు మేరకు నల్లపాడు సీఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.97 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

జగన్ బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

● పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గళ్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పట్టిన శని జగన్‌రెడ్డి అని, ఆ శని నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు 20వ డివిజన్ రామిరెడ్డి నగర్‌లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆమె వద్ద తమ సమస్యలను ఏకరువు పెట్టారు. డ్రైనేజి సమస్యలు కూడా తీర్చలేని స్థితిలో స్థానిక అధికార పార్టీ నేతలు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ గుంటూరును గుంతలూరుగా మార్చింది వైసీపీ ప్రభుత్వమేనన్నారు. అభివృద్ధి విషయంలో స్థానిక వైసీపీ కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశాల్లోనే కాకుండా బహిరంగంగా అసహనం వ్యక్తం చేసినా ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. తాము ప్రజల తరపున ప్రశ్నిస్తే, తమ మీద బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో వైసీపీకి చూపిస్తానని గళ్లా మాధవి అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ల వెంకటేష్, షేక్ సుభాని, అమృతరావు, పసుపులేటి నరసింహారావు, రఫీ, పిన్నబోయిన శివ, రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ఓటర్లతో మాట్లాడుతున్న గళ్లా మాధవి

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



రెస్క్యూ ఆపరేషన్‌పై ప్రదర్శన నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గుంటూరు సిటీ, ఏప్రిల్ 20 : వారం రోజులుగా జరుగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గుంటూరు అగ్నిమాపక కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ డి.కృష్ణవేణి ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించి నప్పుడు తీసుకోవాల్సిన చర్యల పై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాంతీయ అగ్నిమాపక అధికా రి ఎంఎక్యూ జిలాని, జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డి, గుంటూరు-2 కేంద్ర అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఎమర్జెన్సీ సమయాలలో ఉపయోగించే రెస్క్యూ విధానాలు, ఆర్టిఫీషియల్ రెస్పిరేషన్ విధానాలు, అగ్నిప్రమాదాల మీద ప్రజలు, సంస్థలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కొంతసేపు ప్రదర్శన నిర్వహించారు.

ప్రోగ్రామ్ ఫర్ ఎక్స్‌లెన్సీలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 20 : ప్రాంతీయ స్థాయిలో నిర్వహించిన ప్రోగ్రామ్ ఫర్ ఎక్స్‌లెన్సీలో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య శనివారం వెల్లడించారు. ప్రాంతీయ స్థాయిలో మొత్తం 24 బ్రాంచీల స్కూల్స్ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని వెల్లడించారు. గణిత విభాగంలో 100 టెబుల్స్‌లో పోటీలు నిర్వహించారు. స్థానిక లక్ష్మీపురం బ్రాంచి విద్యార్థిని మేధనాగబృహతి, లాలన తదితరులు తొలిరెండు స్థానాలు కైవసం చేసుకోగా, పొన్నూరు బ్రాంచి విద్యార్థులు లిఖిత్, యశ్విత, వెంకట లోకేష్, అమన్‌రషీద్ తదితరులు తృతీయ బహుమతితోపాటు ప్రోత్సాహక బహుమతులు సాధించారని వెల్లడించారు. పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ఏజీఎం డాక్టర్ అంజయ్య, ప్రిన్సిపల్స్ ఎశైలజ, నర్మద, అరుంధతి, బాషా తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ అంజయ్య తదితరులు

మే 13న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

● సంయుక్త కార్మిక కమిషనర్ శ్రీనివాస్ కుమార్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 20 : ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చే నెల మే 13వ తేదీ కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని జిల్లాలోని పరిశ్రమలు, దుకాణదారుల యాజమానులకు సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. సదరు సెలవు రోజున కార్మికుల వేతనాలలో ఎటువంటి తగ్గింపు చేయవద్దని తెలిపారు. నిబంధనలు పాటించ కపోతే సదరు యాజమానికి జరిమానాతో పాటు కఠిన శిక్ష విధిస్తామని హెచ్చరించారు.

మద్యం, నగదు సీజ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 20: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో రూ11,550 విలువ గల 13.83 లీటర్ల లిక్కర్, మంగళగిరి నియోజకవర్గ పరిధిలో రూ. 1,60,000, తాడికొండ నియోజకవర్గ పరిధిలో రూ.66,000 నగదు సీజ్ చేయడం జరిగిందని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో ఏప్రిల్ 20వ తేది సాయంత్రం 6 గంటల వరకు రూ.2,26,65,960 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేయటం జరిగిందన్నారు.



కేక్ కట్ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, డేగల ప్రభాకర్ తదితరులు



కేక్ కట్ చేస్తున్న గళ్లా మాధవి, కనపర్తి శ్రీనివాసరావు తదితరులు

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

● కేకులు కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసిన పార్టీ శ్రేణులు

● పెమ్మసాని, గళ్లా మాధవి, నసీర్, కనపర్తి ఆధ్వర్యంలో వేడుకలు

గుంటూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యాలయం, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల కార్యాలయాల్లో తెలుగు తమ్ముళ్లు సందడి చేశారు. కేకులు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు, భువనేశ్వరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గుమ్మడికాయలతో దిష్టితీసి జేజేలు పలికారు. కీడు తొలగిపోయి ఆయన ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్రం గాడిలో పడాలని కోరుకున్నారు.

కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో..



కేక్ కట్ చేస్తున్న కనపర్తి శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు విద్యానగర్‌లోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి అనంతరం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, వారికి గుమ్మడికాయతో దిష్టి తీసి జేజేలు పలికారు. ఈ సందర్భంగా కనపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ అనేక సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేయటమేకాక నీటి కుంటలు, చెక్ డ్యాములు నిర్మించి, గ్రామీణ మహిళల ఆర్థిక స్వాలంబన కోసం డ్వాక్రా పథకాన్ని ఒక ఉద్యమస్థాయిలో ప్రోత్సాహించిన వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. రాజకీయాలలో గెలుపోటములు తాత్కాలికమే అని తెలియక చంద్రబాబుని సైకో జగన్‌రెడ్డి అనేక విధాలుగా అవమానాలకు గురి చేశాడని అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, మహిళా అధ్యక్షురాలు దాసరి జ్యోతి, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజి, లంకా ఉదయ్, పఠాన్ అస్మతుల్లా, షేక్ మస్తాన్ వలి, షేక్ ఖరీమా, తదితర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో..



కేక్ కట్ చేస్తున్న శ్రావణ్‌కుమార్, తెలుగుతమ్ముళ్లు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రావణ్‌కుమార్, డేగల ప్రభాకర్ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల శ్రేయస్సుకై నిరంతరం తపించే నిత్య కృషీవలుడు చంద్రబాబు అని అన్నారు. డేగల ప్రభాకర్ మాట్లాడుతూ చంద్రబాబు నేటికీ యువకుడిలా కష్టపడుతూ, సమాజ హితం కోసం, రాష్ట్రం అభివృద్ధి కోసం, మన పిల్లల భవిష్యత్తు కోసం నిరంతరం సంకల్పబలంతో, ముందుచూపుతో పని చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిట్టాబత్తిన చిట్టిబాబు, మానుకొండ శివప్రసాద్, గోళ్ళ ప్రభాకర్, పానకాల వెంకటమహాలక్ష్మి, షేక్ మీరావలి, కంచర్ల శివరామయ్య, చందవోలు శోభారాణి, పోతురాజు సమతా, ముప్పవరపు భారతి, దామచర్ల శ్రీనివాసరావు, బొబ్బిలి రామారావు, మన్నవ వంశీకృష్ణ, రావిపాటి సాయికృష్ణ, పప్పుల దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసాని కార్యాలయంలో..

గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా కేక్‌ను కట్ చేసిన పెమ్మసాని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఇలాంటి పుట్టినరోజులు వేడుకలు మరెన్నో చేసుకోవాలని కోరుకున్నారు.

గళ్లా మాధవి కార్యాలయంలో..

ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు నాయుడే అని గళ్ళా మాధవి తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు శనివారం ఆమె కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్రం అనేక ఏళ్లుగా ఆటుపోటులకు గురి అవుతోందని, రాష్ట్రం విడిపోయిన ప్రతిసారి 20 ఏళ్లు వెనక్కిపోతోందని అన్నారు. ఏపీకి బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు ఉండి రాష్ట్రాన్ని పురోగామి పథంలో నడిపించారని గతంలో వెంకయ్య నాయుడు చెప్పారని అది చంద్రబాబు గొప్పతనమని తెలిపారు. చంద్రబాబు వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో కనపర్తి శ్రీనివాసరావు, కొమ్మినేని కోటేశ్వరావు, పప్పుల దేవదాస్, గుంటుపల్లి శేషగిరిరావు, ఆళ్ల హరి, కరిముస్, అస్మా, నస్నే, సాయి తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కార్యాలయంలో...

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి మొహమ్మద్ నసీర్ కేక్ కట్ చేసి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాలు ఇంతగా అభివృద్ధి చెందాయంటే అందుకు కారణం చంద్రబాబేనని నసీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టాబత్తిన చిట్టిబాబు, పోతురాజు సమత, ముప్పవరపు భారతి, చిష్టి, జ్యోతి, జాగర్లమూడి శ్రీనివాస్, సత్యం, ఆంజనేయ ప్రసాద్, శ్రీనివాస్, చిలక వెంకటేశ్వర్లు, దయారత్నం, పోతురాజు చంద్ర, జమీర్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నసీర్, టీడీపీ శ్రేణులు

తాడిశెట్టి కార్యాలయంలో ...

గుంటూరు, ఏప్రిల్ 20 : రాష్ట్ర రాజకీయాల్లోనే కాక దేశ రాజకీయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న నిత్య ప్రజా సేవకుడు, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తాడిశెట్టి మురళి మోహన్, ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు కొనియాడారు. చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవం సందర్భంగా పట్టాభిపురంలోని తాడిశెట్టి కార్యాలయంలో వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన టీడీపీ నాయకులు, తాడిశెట్టి అనుచరులు, అభిమానుల సమక్షంలో తాడిశెట్టి మురళి మోహన్, బూర్ల రామాంజనేయులు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ప్రజలకు స్వచ్ఛమైన సేవలను అందిస్తున్న చంద్రబాబుకి ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ మెండుగా ఉంటాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించటం ఖాయమన్నారు. కార్యక్రమంలో దుపాటి కోటేశ్వరరావు, నరసింహా, జొన్నలగడ్డ దాస్, మహేష్, ఆంజనేయులు, జరుగుమల్లి అబ్రహం, చౌదరి బాబు, గిరి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, రాము, రోశయ్య, తాడిశెట్టి యూత్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న రామాంజనేయులు, తాడిశెట్టి మురళీ తదితరులు

ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో..

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 20 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు స్థానిక విద్యానగర్‌లో ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎన్డీఏ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు హాజరై కేక్ కట్ చేసి చంద్రబాబునాయుడుకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో టాటా 'ఐపీఎల్' ఫ్యాన్‌పార్క్ సందడి

● తరలివచ్చిన క్రికెట్ అభిమానులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 20: నగరంలో శనివారం టాటా ఐపీఎల్ ఫ్యాన్‌పార్క్ సందడి నెలకొంది. బీసీసీఐ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని ఎల్ఈఎం మైదానంలో ఏర్పాటు చేసిన భారీ మెగా డిజిటల్ స్క్రీన్‌పై క్రికెట్ లైవ్ మ్యాచ్‌లను తిలకించడానికి పెద్ద ఎత్తున అభిమానులు హాజరయ్యారు. శనివారం ఢిల్లీ క్యాపిటల్-సన్ రైజర్స్ హైదరాబాదు మ్యాచ్‌ను అభిమానులు వీక్షించారు. ఆహ్లాదకర వాతావరణంలో మ్యాచ్‌లు చూసేందుకు క్రికెట్ అభిమానులు భారీగా తరలివచ్చారు. యువతి, యువకులతో పాటు చిన్న పిల్లలు, పెద్దలు కూడా ఉండటం విశేషం. వేదిక ఆవరణలో చేపట్టిన వివిధ రకాలు ఏర్పాట్లు ఆహుతులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఆటలు, యువతీ, యువకుల సెల్ఫీలు, వీఐపీ లాంజ్, అల్పాహారం, శీతాల పానీయల స్టాల్స్ మధ్యలో ఆశీనులైన అభిమానులు, వెరసీ సౌండ్ సిస్టమ్, త్రీడీ లైటింగ్‌లతో వేదిక దద్దరిల్లింది. ఫోర్ కొడుతున్నా, సిక్స్ బాదుతున్నా, వికెట్ పడుతున్నా, క్యాచ్‌లు అందుకుంటున్నా సమయాల్లో కుర్రకారు కేరింతలు, ఈలలతో మైదానం హోరెత్తింది. అభిమానులు రిజిస్ట్రేషన్ చేయించుకుని కూపన్లు తీసుకోన్న సంబందించి లక్కీ డిప్ ద్వారా బహుమతులు అందజేసారు.

ఆదివారం కోల్‌కత్తా నైట్ రైడర్స్-రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు, పంజాబ్ కింగ్స్-గుజరాత్ టైటాన్స్ రెండు మ్యాచ్‌ల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేసారు. ఆదివారం మ్యాచ్‌లతో టాటా ఐపీఎల్ ఫ్యాన్‌పార్క్ ప్రదర్శన ముగియనుంది. ఏర్పాట్లను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి, సభ్యులు సాయిరాం, రమణశర్మ పర్యవేక్షించారు.





ఐపీఎల్ మ్యాచ్‌లను లైవ్ చూస్తున్న క్రికెట్ అభిమానులు

కూటమి గెలుపునకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యాప్త ప్రచారం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 20: ఎన్డీఏ గెలుపుకై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారాలు, చైతన్య సదస్సులు జరుపుతున్నట్లు స్వర్ణాంధ్రా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ అన్నారు. స్థానిక గోరంట్లలోని శనివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదిన పల్నాడులో జిల్లాలో ప్రచారం ప్రారంభిస్తానని, మే 10న విశాఖ జిల్లాలో జరిగే సభతో ముగిస్తామని వివరించారు. ప్రచారంలో ఆయా జిల్లాలోని సంఘ కార్యకర్తలు, మాదిగలు పాల్గొనాలని కోరారు.

తూర్పు నియోజకవర్గంలో భారీ చేరికలు

● ఒకే రోజు నాలుగు డివిజన్ల నాయకులు టీడీపీలోకి

● పెమ్మసాని ఆధ్వర్యంలో పసుపు కండువా కప్పుకున్న వైసీపీ నేతలు

గుంటూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వైసీపీకి దెబ్బ మీద దెబ్బ తగులుతూనే వుంది. అధికార వైసీపీని వీడి టీడీపీలో చేరే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతూ ఉంది. ఒకేరోజు నియోజకవర్గంలోని 5, 12, 14, 15 డివిజన్లలో 500 మందికి పైగా వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే షేక్ సుభాని, పలువురు కార్పొరేటర్లు, కార్యకర్తలు నాయకులతో కలిసి ఇటీవల టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలోనే శనివారం కూడా టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. కాగా 12వ డివిజన్ నుంచి 50 మంది, 14వ డివిజన్ నుంచి 150 మంది, 15వ డివిజన్ నుంచి 200, ఐదో డివిజన్ నుంచి మరో వందమంది నాయకులు టీడీపీలోకి వచ్చారు. వారికి పెమ్మసాని, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నసీర్, నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్‌లు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పదేళ్లుగా ఎమ్మెల్యే ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. స్థానికంగా కొందరు నాయకులే గంజాయి అమ్ముతున్నా ప్రశ్నించలేని దుస్థితిలో ప్రజలు ఊరకుండి పోతున్నారన్నారు. నియోజకవర్గంలోని డివిజన్లలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలతో ప్రజల అవస్థలు పడుతున్నా ఈ ఎమ్మెల్యేకి ఏమీ పట్టడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే షేక్ (నంబూరు) సుభాని, భరత్‌రెడ్డి, చిట్టాబత్తిన చిట్టిబాబు తదితర టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో పెమ్మసాని చంద్రశేఖర్, నసీర్ తదితరులు

ఏడో రోజు ప్రజాదీవెన యాత్ర

గుటూరు తూర్పు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ చేపట్టిన ప్రజాదీవెన యాత్ర ఏడో రోజు కొనసాగింది. గుంటూరు నాలుగో డివిజన్ జాకీర్ హుస్సేన్ నగర్, తమ్మి రంగారెడ్డి నగర్, రెడ్ల బజార్ మీదగా యాత్ర సాగింది. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులకు ఇవ్వాల్సిన పెన్షన్లు కూడా ఆపి సొంత సామాజిక వర్గానికి చెందిన కాంట్రాక్టర్లకు జగన్ డబ్బు చెల్లించుకున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో తనను, పెమ్మసానిని గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అప్పుడు మాత్రమే రాష్ట్రం గాడిన పడుతుందని చెప్పారు.



ప్రజా దీవెన యాత్రలో పాల్గొన్న నసీర్ తదితరులు

కూటమికి బీసీ సంక్షేమ సంఘం మద్దతు : కేశన

బాపట్ల, ఏప్రిల్ 20 : టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకి ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం మద్దతు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు తెలిపారు. వేగేశన ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, బీసీ సంక్షేమ సంఘ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ సామాజిక న్యాయం చేస్తామంటున్న వైసీపీ పాలకులకు అసలు సామాజిక న్యాయం అనే మాటకు అర్థం తెలుసా అని ప్రశ్నించారు? విద్య, వైద్యం ఉచితంగా అందివ్వాలని, అలాంటివి లేకుండా తాయిళాలు ఇచ్చుకుంటూపోతూ దానికి సంక్షేమం అనే పేరు పెట్టటం తగదని మండిపడ్డారు. సంఘయువజన అధ్యక్షులు క్రాంతికుమార్ మాట్లాడుతూ బీసీల సంక్షేమం గురించి ఎమ్మెల్యే కోన రఘుపతి దగ్గరకెళ్ళి మాట్లాడితే వ్యంగ్యంగా మాట్లాడారని మండిపడ్డారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 50 శాతం ఉన్న బీసీల అభ్యున్నతికి కూటమి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్, జిల్లా న్యాయ సలహాదారులు అంగలకుదురు నటరాజన్, జిల్లా కార్యదర్శులు ఎస్ఎస్‌పి రాజు, మారం రవికుమార్, మహిళా అధ్యక్షురాలు కంకణాల బాలమ్మ, యువజన అధ్యక్షులు గోపినాథ్ పాల్గొన్నారు.

23న ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థి జంగాల నామినేషన్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 20 : ఇండియా కూటమి పార్లమెంట్ అభ్యర్థిగా జంగాల అజయ్ కుమార్ ఈనెల 23 తేదీన నామినేషన్ వేయనున్నట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక కొత్తపేట సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23న స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించి, అనంతరం నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, ఇండియా కూటమి పార్టీల నాయకులు పాల్గొంటారని వివరించారు. సమావేశంలో కోటా మాల్యాద్రి, మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ అభ్యర్థిగా రజినీ నామినేషన్ దాఖలు

గుంటూరు,ఏప్రిల్ 20: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినీ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. రింగ్‌రోడ్డులోని చంద్రమౌళీనగర్‌లో ఉన్న మంత్రి కార్యాలయం నుంచి కొరిటపాడు సెంటర్, బ్రాడీపేట మీదుగా హిందూ కళాశాల సెంటర్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే, గుంటూరు ఎంపీ వైసీపీ అభ్యర్థి కిలారి రోశయ్య, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పలువురు కార్పొరేటర్లు, నాయకులు నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చారు.

రేపు తూర్పునకు మస్తాన్‌వలి నామినేషన్

గుంటూరు, ఏప్రిల్ 20 : ఇండియా కూటమి అభ్యర్థిగా గుంటూరు తూర్పు నియోజకవర్గంనకు మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు పొన్నూరు రోడ్డులోని బారాయిమాం పంజానున్న కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించిన ఆయన నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాతగుంటూరులోని మణి హోటల్ సెంటర్ నుంచి పాత గుంటూరు, ఎన్టీఆర్ సర్కిల్, మాయబజార్ సెంటర్ మీదుగా నగరపాలక సంస్థ వరకు ర్యాలీగా నామినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మస్తాన్‌వలి తెలిపారు.


రింగ్‌రోడ్‌లో మంత్రి రజని ఆఫీస్ ఎదుట బైకులతో రోడ్డు బ్లాక్ చేసిన వైసీపీ కార్యకర్తలు

ఆరు సార్లు.. అప్రతిహతంగా..


జవహర్‌లాల్ నెహ్రూతో కొత్త రఘురామయ్య


కొత్త రఘురామయ్య

- డబుల్ హ్యాట్రిక్ మహానేత కొత్త రఘురామయ్య
- కేంద్రంలో కీలక మంత్రి పదవులు
- వరుసగా ఆరు సార్లు ఎంపీగా విజయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఓటమి ఎరుగని మహానాయకుడు.. దాదాపు మూడు దశాబ్దాలపాటు పార్లమెంట్ సభ్యునిగా పనిచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా ఆరుసార్లు విజయకేతనం ఎగురవేసి డబుల్ హ్యాట్రిక్ సాధించారు. ఓటమి ఎరుగని ధీరుడు కొత్త రఘురామయ్య. కేంద్ర ప్రభుత్వంలో కీలక మంత్రి పదవులను అలంకరించారు. 1952 నుంచి 1979 వరకు లోక్ సభ సభ్యుడిగా ఉన్నారు. సంగం జాగర్లమూడి గ్రామంలో 1912, ఆగస్టు 6న ఆయన జన్మించారు. గుంటూరులోని ఆంధ్రా క్రిష్టియన్ కళాశాల, లక్నో విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించారు. అనంతరం రఘురామయ్య ఇంగ్లాండులోని మిడిల్ టెంపుల్ వెళ్ళి 'బార్-ఎట్-లా' చదివాడు. స్వదేశము తిరిగి వచ్చి 1937 నుంచి 1941 వరకు మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తదుపరి బ్రిటీషు ప్రభుత్వంలో న్యాయశాఖలో కొంతకాలం ఉద్యోగం చేశారు. అనంతరం భారత ప్రభుత్వ న్యాయ శాఖలో డిప్యుటీ సెక్రటరీగా పనిచేశారు. 1951లో ప్రభుత్వ ఉద్యోగం వదలి జాతీయ కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయరంగంలోకి అడుగు పెట్టారు.

మూడు దశాబ్దాలుపాటు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలకపాత్ర వహించారు. తొలి లోక్‌సభకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తెనాలి నుంయి (1952-57) ఎన్నికయ్యారు. రెండవ లోక్ సభ (1957-62) ఎన్నికల్లో గుంటూరు లోక్ సభా స్థానం నుంచి గెలుపొందారు. ఆ తదుపరి వరుసగా 3వ లోక్ సభ (1962-67), 4వ లోక్ సభ (1967-72), 5వలోక్ సభ (1972-77), 6వ లోక్‌సభ (1977-1980) లలో గుంటూరు నియోజకవర్గం నుంచి విజయం సాధించారు.

జవహర్ లాల్ నెహ్రూ మంత్రివర్గంలో 1957లో రక్షణ శాఖ సహాయ మంత్రిగా.. 1964 వరకు రక్షణ, కార్మిక, పౌర సరఫరాలు మంత్రిగా పనిచేశారు. లాల్ బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో(1964-66) వరకు పౌర సరఫరాలు, సాంకేతిక శాఖలకు కేంద్రమంత్రిగా సేవలందించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇందిరాగాంధీ గారి మంత్రివర్గంలో(1966- 77) వరకు న్యాయ, పెట్రోలియం, పార్లమెంటరీ వ్యవహారాలు, నౌకా రవాణా, పర్యాటక శాఖామాత్యులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. దేశంలో అనేక అభివృద్ధి కార్యాక్రమాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర పజలకు విశేష సేవలు అందజేశారు.

1975లో ఆంధ్ర విశ్వవిద్యాలయం, 1977లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం కొత్త రఘురామయ్యకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించాయి. కళాప్రపూర్ణ పురస్కారాన్ని కూడా ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించి ఆయనను సత్కరించింది. పార్లమెంట్ సభ్యుని పదవిలో ఉన్న సమయంలోనే 1979 జూన్ 6న రఘురామయ్య మరణించారు. కొత్త రఘురామయ్య పేరుతో నరసరావుపేట, దుగ్గిరాలలో రెండు కళాశాలలు ఏర్పాటు చేశారు.

డబ్బులిచ్చి.. తరలించారు

- మంత్రి రజని నామినేషన్ ప్రక్రియలో భారీగా జనసమీకరణ
- డ్వాక్రా మహిళలకు నగదు, చీరలు
- రింగ్ రోడ్ వద్ద వైసీపీ కార్యకర్తలు బైక్‌లతో హల్‌చల్

గుంటూరు (కార్పొరేషన్), ఏప్రిల్ 20: రాష్ట్ర మంత్రి విడదల రజని నామినేషన్ రోజున బలప్రదర్శన కోసం అడుగడుగునా ఎన్నికల నియమావళిని ఉల్లఘించా రు. వైసీపీ నాయకులు యథేచ్ఛగా డబ్బు, మద్యం పంపిణీ చేశారు. శనివారం ఆమె గుంటూరు పశ్చిమ వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. రింగ్ రోడ్‌లోని ఐడీబీఐ బ్యాంక్ సెంటర్ నుంచి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా జరిగింది.

పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ప్రతి డివిజన్ నుంచి ఆయా డివిజన్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పెద్దఎత్తున జన సమీకరణకు భారీగా డబ్బులు ఖర్చు పెట్టారు. అనేక ప్రాంతాల్లో టిఫిన్, భోజన సదుపాయాలు కల్పించారు. నియోజకవర్గంలోని సీఎంఎంకు రూ.20 వేలు, చీర, కమ్యూనిటీ ఆర్గనైజర్స్(సీవో) ఏడుగురికి రూ.పదివేల రూపాయలు నగదు, చీర, రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీ) సుమారు 100 మందికి 5 వేల రూపాయల చీర అందించినట్లు సమాచారం. దీంతో డ్వాక్రా మహిళలను పెద్దఎత్తున నామినేషన్ ప్రక్రియకు తరలించారు. ప్రతి ఒక్కరికి నగదు, ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనాన్ని పెట్టి మరి ఆటోలో తీసుకొచ్చి తిరిగి అదే ఆటోలో ఇంటి వద్ద వదిలిపెట్టే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో సీఎంఎం, సీవోలు, ఆర్పీలు డబ్బులు తీసుకొని పెద్దఎత్తున డ్వాక్రా మహిళలను తరలించారు.

మంత్రి రజని నామినేషన్ ప్రక్రియలో డబ్బులు, మద్యం ఏరులై పారాయి. మగాళ్లకు ప్రతి ఒక్కరికి క్వార్టర్ బాటిల్ పంపిణీ చేశారు. మందుతోపాటు రూ.500 అందజేశారు. మహిళలకు రూ.500, చీరను పంపిణీ చేశారు. ఈ ప్రక్రియ అంతా కళ్లెదుట జరుగుతున్నా ఎన్నికల పరిశీలకులు, మైక్రో అబ్జర్వర్లకు, ఇతర ఎన్నికల అధికారులకు ఎక్కడా కనపడలేదు.

రింగ్ రోడ్‌లో అరాచకం...

రింగ్ రోడ్‌లో మంత్రి రజని ఆఫీస్ వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు అరాచకం సృష్టించారు. ఐడీబీఐ బ్యాంక్ ఎదుట రోడ్డును బైకులతో బ్లాక్ చేసి వాహన దారులకు తీవ్ర ఇబ్బంది కలిగించారు. దీంతో ఆ దారిలో వెళ్లేవారు ట్రాఫిక్‌లో ఇరుక్కొని ఇబ్బందులు పడ్డారు. మంత్రి రజని కార్యాలయం ఎదుట సుమారు గంటకు పైగా బైకులను అడ్డుగా పెట్టి ట్రాఫిక్‌ను నిలిపివేశారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

చివరి నిమిషంలో ఛాన్స్ మిస్


మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 20: ఎన్నికల వేళ రాజకీయ పార్టీల కూడికలు,తీసివేతలకు తెంపేవుండదు. ఈ లెక్కల్లో రాత్రికి రాత్రి ఎంపీ, ఎమ్మెల్యే లు అయిన వాళ్లు ఉన్నారు.. రాత్రి కి రాత్రి కి ఛాన్స్ మిస్ అయిన వాళ్లు వున్నారు.1999 ఎన్నికల్లో గురజాల నియోజకవర్గంలో అటువంటి ఆసక్తి కర సన్నివేశం జరిగింది. అంతా ఓకే అయ్యింది బి-ఫామ్ తీసుకోవటానికి రమ్మని మాజీ ఎమ్మెల్సీ టిజివి కృష్ణరెడ్డి కి హైదరాబాద్ గాంధీ భవన్ నుండి ఫోన్ వచ్చింది. పట్టలేని సంతోషం తో ఆయన గురజాల నుండి హైదరాబాద్ వెళ్లే సరికి సీన్ మారిపోయింది. నరసరావుపేట పార్లమెంటు పరిధిలో బీసీలకు ఒక్క సీటు ఐయినా ఇస్తే బాగుంటుందన్న వాదన తెర పైకి రావటంతో టిజివికి ఛాన్స్ మిస్ అయ్యింది. ఆ సీట్‌ను ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి కేటాయించడంతో ఎగువ సభలో ప్రవేశించేందుకు టిజివి కృష్ణా రెడ్డి దశాబ్ద కాలం వేచి చూడాల్సి వచ్చింది.

వృద్ధులు.. దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు





(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వృద్ధులు.. దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులు హోం ఓటింగ్ వినియోగించుకోవచ్చు. ఇందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు హక్కును పొందేందుకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఫారం-12డి దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల కమిషన్ నిర్దేశించిన తేదీల్లో వారి ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేయించుకోనున్నారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు జారీ చేయడంతో తదనుగుణంగా చర్యలు చేపట్టారు. ఉద్యోగులు ఏ విధంగా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకుంటారో అదే విధంగా వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తులను అందుబాటులో ఉంచారు. ఆ దరఖాస్తు తోపాటు ఓటరు కార్డు నకలు కూడా జత చేసి సమర్పించాలి. నియోజకవర్గ పరిధిలోని ఆర్వోల వద్ద దరఖాస్తు చేసుకుంటే వచ్చేనెల 5వ తేదీ నుంచి 9వ తేదీలోపు వారి ఇంటి వద్దకే వచ్చి ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆర్వో కార్యాలయాల్లో దరఖాస్తులు కూడా స్వీకరిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి జరిగే ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వృద్ధులు, దివ్యాంగుల కోసం ఈ అవకాశాన్ని కల్పించింది.

గుంటూరు ఎంపీ స్థానానికి ఐదు నామినేషన్లు

గుంటూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల ఘట్టం మూడో రోజైన శనివారం గుంటూరు లోక్‌సభ స్థానానికి ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పార్టీ తరపున ఎండీ ఖాజామొయినుద్దీన్ చిష్టీపాషా, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి సయ్యద్ సైదా, ఇండియన్ లేబర్ పార్టీ(అంబేడ్కర్ పూలీ) నుంచి డాక్టర్ రాజేషర్ ఆర్ విజయ్‌కుమార్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కాసు ఏసురెడ్డి, వెంకటరమణ బోయపాటి నామినేషన్లు వేశారు. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి శనివారం ఎవరూ నామినేషన్లు వేయలేదు. నామినేషన్లకు ఆదివారం సెలవు. కాగా సోమవారం టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ భారీ ర్యాలీతో వచ్చి కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు.

అసెంబ్లీ స్థానాలకు..

అసెంబ్లీ స్థానాలకు సంబంధించి గుంటూరు తూర్పులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి తరపున షేక్ ఆరిఫ్, షేక్ అల్తాఫ్, ఇండిపెండెంట్లుగా వహీద్ షకీల్ అహ్మద్, సలార్ షేక్, గుంటూరు పశ్చిమలో టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి భర్త గల్లా రామచంద్రరావు శనివారం చేరొక నామినేషన్ దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థి విడదల రజిని రెండు సెంట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మంగళగిరిలో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున రావు సుబ్రహ్మణ్యం, పొన్నూరులో పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి రమేష్ జొన్నాదుల నామినేషన్లు వేశారు.

మహిళలంటే మహాశక్తి

- ఆవకాయ పట్టాలన్నా, అంతరిక్షానికి వెళ్లాలన్నా మహిళలకే సాధ్యం!
- ప్రజలందరి ఆశీస్సులతో నిండు నూరేళ్లు చంద్రబాబు సేవలు
- తాడేపల్లి స్త్రీశక్తి, మహిళా మిత్ర డ్వాక్రా మహిళలతో నారా బ్రహ్మణి


చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బ్రహ్మణి, మహిళా నేతలు


స్త్రీశక్తి, డ్వాక్రా మహిళలతో బ్రహ్మణి

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 20: ఆవకాయ పట్టాలన్నా, అంతరిక్షానికి వెళ్లాలన్నా మహిళలకే సాధ్యమని, మహిళలంటే మహాశక్తి అని, నేడు ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని నారా బ్రహ్మణి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి గౌడ కళ్యాణ మండపంలో స్త్రీశక్తి లబ్ధిదారులు, మహిళా మిత్ర, డ్వాక్రా మహిళలతో శనివారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బ్రాహ్మణి మాట్లాడుతూ ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. మహిళలకు ప్రత్యేకంగా యూనివర్సిటీ స్థాపించింది కూడా ఎన్టీఆరేనని అన్నారు. ఆయన ప్రజాసేవకు కొనసాగింపుగా చంద్రబాబు, లోకేశ్‌లు మహిళల సాధికారతకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు దేశం మొత్తం మీద ఏపీలో డ్వాక్రా సంఘాలను నెంబర్ 1గా నిలిపారని బ్రాహ్మణి అన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళల స్వయం ఉపాధికి సహకారం అందిస్తూ చంద్రబాబు, లోకేశ్‌లు మహిళా సాధికారతను మాటల్లోనే కాకుండా చేతల్లో చూపిస్తున్నారన్నారు. అందుకు ఉదాహరణగా వివాహమయ్యాక వారి ప్రోత్సాహకంతోనే తాను యుఎస్, సింగపూర్ వెళ్లి ఉన్నత చదువులు చదివానని బ్రహ్మణి తెలిపారు. హెరిటేజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యాపారాన్ని చూసుకోవడమేకాక, బసవతారకం క్యాన్సర్ సెంటర్ ద్వారా సేవలందిస్తున్నాని చెప్పారు. హెరిటేజ్ ద్వారా మహిళా రైతులను ప్రోత్సహించడంతోపాటు వారి ఆదాయం పెరిగి కుటుంబాలకు అండగా నిలుస్తున్నామన్నారు.

మంగళగిరి ప్రజలే కుటుంబంలా...

గత ఎన్నికల్లో మంగళగిరిలో లోకేశ్ ఓడిపోయినా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని సేవలందిస్తున్నారని బ్రహ్మణి తెలిపారు. మంగళగిరి ప్రజలను లోకేశ్ ఆయన కుటుంబంలా భావిస్తూ సొంత నిధులతో 29 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. మంగళగిరిని దేశంలో నెంబర్ 1గా చేయాలన్న లక్ష్యంతో ఆయన పని చేస్తున్నారని తెలిపారు. అన్న క్యాంటిన్లు, పెళ్లికానుక, సంజీవిని ఆరోగ్య పథకాల వంటి కార్యక్రమాల ద్వారా సేవ చేస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉండే ఇంత చేస్తున్నారంటే ఎమ్మెల్యేగా ఎన్నికైతే లోకేశ్ ఎంత సేవ చేస్తారో మహిళలంతా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు అన్ని రంగాల్లో అత్యధిక ప్రాధాన్యతనిచ్చేది తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు.

స్త్రీశక్తి సేవలు అభినందనీయం: పెమ్మసాని శ్రీరత్న

గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ శ్రీరత్న మాట్లాడుతూ మంగళగిరిలో మహిళల స్వావలంబనకు స్త్రీ శక్తి పథకం ద్వారా లోకేశ్, బ్రహ్మణి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా తాను గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పర్యటిస్తున్నప్పుడు కుటుంబంలో ఇంటిపెద్ద సంపాదనపై అయిదారుగురు ఆధారపడి జీవించడం చూశారన్నారు. అటువంటి కుటుంబాల్లో మహిళలకు స్త్రీశక్తి వంటి పథకం ఎంతో అలంబనగా నిలుస్తాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైతే ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్రమంతా అమలు చేయడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా కూటమి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న చంద్రశేఖర్, లోకేశ్‌లను అత్యధిక మెజార్టితో గెలిపించాలని, అప్పుడే భారీ ఎత్తున అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్నారు.

స్త్రీశక్తి ద్వారా కుటుంబాలకు చేదోడుగా నిలుస్తున్నాం

ఈ సమావేశంలో పలువురు స్త్రీశక్తి లబ్దిదారులు నారా బ్రాహ్మణి ఎదుట తమ మనోభావాలను తెలియజేశారు. అనూష అనే మహిళ మాట్లాడుతూ పెరిగిన ధరలు, చాలీచాలని ఆదాయంతో కుటుంబాలను భారంగా లాగుతున్న సమయంలో స్త్రీశక్తి పథకం మాకు ఎంతగానో ఉపకరించిందన్నారు. ఈ పథకం ద్వారా కుట్టు శిక్షణ పొంది ఆదాయం పొందుతున్నారన్నారు. జుహేదా మాట్లాడుతూ నేను డిగ్రీ చదివి ట్యూషన్స్ నడుపుతున్నానని, ఆ ఆదాయం సరిపోక స్త్రీశక్తి పథకం ద్వారా మిషన్ నేర్చుకుని, స్టిచ్చింగ్ నేర్చుకోవడం వల్ల నాకు అదనపు ఆదాయం సమకూరుతోందని ఆనందం వ్యక్తం చేసింది. మరికొందలు లబ్ధిదారులు మాట్లాడుతూ చదువులేని మహిళలు కూడా నైపుణ్యంతో స్వయం ఉపాధి పొందేందుకు స్త్రీశక్తి పథకం ప్లాట్‌ఫాంలా ఉపయోగపడుతుందన్నారు. కేవలం ఉపాధి ఇవ్వడమే కాక తమ కుటుంబాల్లో ఆరోగ్య సమస్యలు ఎదురైన వారికి సంజీవని ఆరోగ్య రథాల ద్వారా సేవలందిస్తున్నారన్నారు. తమకు అండగా నిలుస్తున్న లోకేశ్‌ను పోరాడి గెలిపించుకుంటామన్నారు. నారా బ్రహ్మణి స్పందిస్తూ స్త్రీశక్తి మహిళలు సాధించిన విజయాలు తమకు స్ఫూర్తిదాయకమని అన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఉందా.. లేదా?

- డీఆర్వోకు ఏపీజేఏసీ నాయకుల వినతి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 20: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఉందా.. లేదా అని ఏపీజేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు ప్రశ్నించారు. పోస్టల్ బ్యాలెట్ గడువు సమీపిస్తున్నా ఇంతవరకు జిల్లాలో ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరుతూ శనివారం కలెక్టరేట్‌లో డీఆర్వో పెద్ది రోజాకు ఏపీజేఏసీ ఉద్యోగుల సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఘంటశాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ వినియోగం నూరు శాతం జరిగేలా ఎన్నికల సంఘం దిశా నిర్దేశం చేసినా జిల్లాలో ఆ పరిస్థితి కనబడటం లేదని తెలిపారు. 12 డీ ఫామ్‌లను ఎక్కడ సమర్పించాలనే విషయమై ఉద్యోగుల్లో అయోమయం నెలకొందన్నారు. ఫామ్‌లను తహసీల్దార్లకు ఇవ్వాలని, కొందరు, ఓటు ఉన్న చోటే తహసీల్దార్లకు ఇవ్వాలని మరి కొందరు, నియోజకవర్గ హెడ్‌క్వార్టర్ తహసీల్దారుకు ఇవ్వాలని ఆర్‌వోలు చెబుతూ ఉద్యోగుల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సిబ్బంది నిర్వాకంతో ఉద్యోగుల ఓట్లు ప్రమాదంలో పడ్డాయన్నారు. పోలింగ్ రోజున ఫామ్ 12తో నేరుగా బూత్‌కు వెళ్లి ఓటు వినియోగించే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ కన్వీనర్ శెట్టిపల్లి సతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగుర్ షరీఫ్, ఉపాధ్యాయ సంఘ నాయకులు బసవ లింగారావు, వేళనని రాజు, కళాధర్, పెదబాబు, ఆంజనేయులు, జానీబాషా, శ్యామ్‌సుందర్, శ్రీనివాస్, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

26 వరకు పోస్టల్ బ్యాలెట్ పొడిగింపు

పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 డీలపై ఓపీవోలు, ఇతర సిబ్బందిలో గందరగోళం నెలకొన్నది. ఒకపక్క గడువు సమీపిస్తుండటం, మరోవైపు అస్పష్టత తొలగకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఎట్టకేలకు ఎన్నికల సంఘం నుంచి పోస్టల్ బ్యాలెట్‌పై విధి విధానాలను జారీ చేసింది. ఫారం-12డీల స్వీకారానికి గడువు తేదీని ఈ నెల 22 నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించింది. ఉద్యోగి ఎక్కడైతే పని చేస్తున్నాడో తన ఓటు వేరే నియోజకవర్గం/జిల్లాలో ఉన్నా ఫారం-12డీని మాత్రం పని ప్రదేశంలోని నియోజకవర్గ కేంద్రంలో ఉండే ఏఆర్‌వోకే ఇవ్వాలిని తెల్పింది. ఏఆర్‌వోలు తమ వద్దకు వచ్చిన ఫారం-12 డీలను ఏ రోజుకు ఆ రోజు ఆర్‌వోలకు పంపాలి.



డీఆర్వో పెద్ది రోజాకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీజేఏసీ నాయకులు

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగి సస్పెన్షన్

పొన్నూరుటౌన్, ఏప్రిల్20: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాచవరం గ్రామంలోని దేవాదాయ శాఖ నైట్ వాచ్‌మెన్ ఉమ్మడి వినోద్ కుమార్‌ను సస్పెండ్ చేసిన్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.లక్ష్మీ కుమారి శనివారం తెలిపారు. ఈ నెల 13వ తేదిన వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలో పాల్గొనటం, మానమ్మకం నువ్వే జగన్ బోర్డు ఏర్పాటు చేయటంతో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినందుకు ఉద్యోగం నుంచి తొలిగించిన్నట్లు ఆర్వో తెలిపారు.

అంబటి మురళిపై మరో కేసు

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 20:: పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణపై తాజాగా మరో కేసు నమోదైంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు వైసీపీపై నాలుగు కేసులు నమోదైన్నట్లు సమాచారం. శనివారం అంబటి మురళీకృష్ణపై మరో కేసు నమోదు చేశారు. ఈ నెల 13వ తేదీన వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై రాయి దాడి జరిగిన తర్వాత అనుమతులు లేకుండా పట్టణంలోని ఐల్యాండ్ సెంటర్‌లో కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించటమే కాకుండా ప్రతిపక్ష టీడీపీపై అసత్య ఆరోపణలు చేయటంపై ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మురళీకృష్ణపై కేసు నమోదు చేశారు. మురళీపై వరుస కేసులు నమోదవటం పట్ల సర్వత్రా చర్చనీయాంసంగా మారింది.



దుగ్గిరాలలో అన్న క్యాంటిన్ వద్ద పేదలతో కలిసి చంద్రబాబు పుట్టిన రోజు కేక్ కటింగ్‌లో పాల్గొన్న టీడీపీ నాయకులు



పెదవడ్లపూడిలోని ఎన్డీఏ కూటమి కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న నేతలు



షరాబ్ బజారులో కేకు కట్ చేస్తున్న స్వర్ణకార సంఘాల నేతలు



కేక్ కట్ చేస్తున్న తాడేపల్లి మండల టీడీపీ నాయకులు



పెదనందిపాడులో చంద్రబాబు జన్మదిన కేక్‌ను కట్‌చేస్తున్న ఎన్నారై టీడీపీ లాస్‌ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ళ వెంకట్



ప్రత్తిపాడులో చంద్రబాబు జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



తుళ్లూరులో చంద్రబాబు పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న టీడీపీ మండల నాయకుడు దామినేని శ్రీనివాస రావు, తెలుగు యువత నాయకులు

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

- పలు గ్రామాల్లో, వార్డుల్లో, పార్టీ కార్యాలయాల్లో కేక్‌కటింగ్
- పేదలకు అన్నదాన కార్యక్రమాల నిర్వహణ
- వృద్ధులకు, చిన్నారులకు పండ్లు, దుస్తుల పంపిణీ



మంగళగిరి టీడీపీ కార్యాలయంలో కేకు కట్ చేసిన టీడీపీ నాయకులు



ఎర్రబాలెంలో గ్రామస్థులు ఏర్పాటు చేసిన కేకును కట్ చేస్తున్న నారా బ్రాహ్మణి

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 20: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను శనివారం మంగళగిరిలో ఘనంగా నిర్వహించారు. మంగళగిరి మండలం ఎర్రబాలెంలో గ్రామస్థులు ఏర్పాటు చేసిన కేకును నారా బ్రాహ్మణి కట్ చేశారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, నియోజకవర్గ అధ్యక్షురాలు అరుద్ర భూలక్ష్మి, ఆకుల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ పద్మశాలి సాధికార సమితి సభ్యుడు జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో చంద్రబాబు పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం మంగళగిరి బైపాస్ రోడ్డులోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 75 కిలోల భారీ కేకును టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, రాష్ట్ర నేతలు కొమ్మారెడ్డి పట్టాభిరామ్, కోనంకి గురుమూర్తి తదితరులు కట్ చేశారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన కేకును పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య కట్ చేసి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళగిరి పాతబస్టాండు సెంటర్లో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. జొన్నాదుల శివశంకర్‌రావు ఆధ్వర్యాన శ్రీకృష్ణ చైతన్య వృద్ధాశ్రమం, షారోను శరణాలయంలో వృద్ధులు, చిన్నారులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. లక్ష్మీనరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గుంటి నాగరాజు ఆధ్వర్యాన షరాబ్ బజారులో కేకు కట్ చేశారు. పెదవడ్లపూడి గ్రామంలోని ఎన్డీఏ కూటమి కార్యాలయంలో నేతలు కేకు కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, నేతలు దామర్ల రాజు, గోవాడ దుర్గారావు, మహమ్మద్ ఇబ్రహీం, వెలగపాటి విలియం, గుత్తికొండ ధనుంజయరావు, తోట పార్థసారధి, మున్నంగి శివశేషగిరిరావు, గాదె పిచ్చిరెడ్డి, గాజుల శ్రీనివాసరావు, పడవల మహేష్, దామర్ల మోహన్, దామర్ల సతీష్, జగ్గారపు రాము, మంద్రు రాము, గుండా గణపతి, కారంపూడి చిరంజీవి, మాదల రమేష్‌బాబు, యేళ్ల శివరామయ్య, అన్నే చంద్రశేఖర్, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, పందిపాటి ఏసుప్రసాద్, కఠారి సాంబయ్య, గడ్డిపాటి అపర్ణ పాల్గొన్నారు.

తాడేపల్లి మండల కార్యాలయంలో

తాడేపల్లి, ఏప్రిల్ 20: నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలు శనివారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి టీడీపీ మండల కార్యాలయంలో తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ, జనసేన పార్టీల నాయకులు కేక్ కట్ చేసి చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన మండల నాయకులు అమరా సుబ్బారావు, సామల నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి జ్యోతిబసు, కుంచనపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, కుంచనపల్లి జనసేన పార్టీ అధ్యక్షుడు మేకల రాజా, కంచర్ల రంగారావు, చిగురుపాటి సుబ్బారావు, శంకరశెట్టి పిచ్చయ్య, షేక్ నాగుల్, గాదె శ్రీనివాసరావు, దాసరి కృష్ణ, కూనపరెడ్డి రమేష్, తాండ్ర కిషోర్, మన్నెం కిషోర్, శేషంశెట్టి శ్రీనివాసరావు భూక్య శ్రీనివాస్ నాయక్, తురక సునీల్, బిరుదుగడ్డ రమేష్, కొలంటి మహేష్, తదితర టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● వడ్డేశ్వరంలో కేక్ కటింగ్ నిర్వహించి గ్రామంలో స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, మద్దినేని సుబ్రహ్మణ్య జోరుగ దాసు, షేక్ నాగూర్ వలి, కామినేని సాంబశివరావు, పాకనాటి మధు, షేక్ నాగూర్, ఎర్రంశెట్టి గణేష్, షేక్ ఇమాం, కరీమా, కత్తిక శ్రీరాములు, కంచర్ల కోటేశ్వరరావు, షేక్ జానీ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



తాడికొండ టీడీపీ కార్యాలయంలో చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

దుగ్గిరాల, ఏప్రిల్ 20: మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ ఆధ్వర్యంలో పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొని చంద్రబాబుకు పరోక్షంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల కార్యాలయంలో అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత చంద్రబాబు పుట్టినరోజు కేకును కట్ చేశారు.

ప్రత్తిపాడు, ఏప్రిల్ 20: స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. చంద్రబాబుకు పుట్టిన రోజు కానుకగా ప్రత్తిపాడులో విజయం సాధించడమే కాకుండా ఆయన ముఖ్యమంత్రి కావడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం సోమవారం జరిగే తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు నామినేషన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, గింజుపల్లి వెంకటేశ్వరరావు, సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాకుమాను, ఏప్రిల్ 20: మండలవ్యాప్తంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. భారీ కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి, పార్టీ మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదనందిపాడు, ఏప్రిల్ 20 : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం, నాగులపాడులో గ్రామపార్టీ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నారై టీడీపీ లాస్ ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ళ వెంకట్, గ్రామపార్టీ అధ్యక్షుడు బండి నాగబాబులు జన్మదిన కేక్‌లను కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, బండి నాగబాబు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, తెలుగురైతు జిల్లా కార్యదర్శి మోపర్తి చెంచయ్య, తుమ్మల కనకయ్యచౌదరి, ఆళ్ళ రాజారావు, సందిరెడ్డి ఉమామహేశ్వరరావు, కాపు రాంబాబు. కొమ్మినేని వెంకటేశ్వర్లు, దివ్వి నాగరాజు, నిమ్మగడ్డ సత్యం, లావు సుబ్బారావు, రాజు పాల్గొన్నారు.

తాడికొండ, ఏప్రిల్ 20: మండలంలో పలు గ్రామాల్లో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు ఎడ్లూరి హనుమంతరావు ఆధ్వర్యంలో తాడికొండ పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో కలిసి కేక్ కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు. నిడుముక్కలలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, చిగురుపాటి అనూఫ్, ధూళిపాళ్ల ఏసుబాబు, నూతక్కి నవీన్‌కుమార్, జబ్రుద్దీన్, మన్నె బాబు, ముక్కెర శ్రీను, భాస్కరరావు తదితర నాయకులు పాల్గొన్నా రు.

తుళ్లూరు, ఏప్రిల్ 20: తుళ్లూరులోని గీతా మందిరం సెంటర్‌లో పార్టీ శ్రేణులు భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్‌ని, గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ని భారీ మెజార్టీతో గెలిపించుకొని చంద్రబాబునాయుడికి పుట్టిన రోజు కానుకగా అందిస్తామని దామినేని అన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు మూల్పూరి నరేష్, నాయకులు పువ్వాడ గణేష్, కట్టా నరసింహరావు, యువత నాయకులు మామిళ్ల పల్లి శివ, మెండెం నాగరాజు, చిట్టినేని అనిల్, కొమ్మి నేని నరేంద్ర (నాని) అధిక సంఖ్యలో యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 20: మండలం పరిధి గ్రామాల్లో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండలం పరిధి పుల్లడిగుంటలో పార్టీ గ్రామ అధ్యక్షుడు ముప్పరాజు శేషగిరిరావు ఆధ్వర్యంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు మస్తాన్‌వలి, మన్నవ గోపాలకృష్ణ, యడ్లపల్లి వీరప్రసాద్, జి.సదాశివరావు, ఎం శంకరరావు, ఎం శ్రీనివాసరావు, కరీముల్లా, అలాభక్షులు, ఉప్పటూరి పెదరాములు తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

● ముట్లూరులోని బొడ్డురాయి సెంటర్లో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అయినంపూడి అప్పయ్య, సుబ్బారావు, సురేష్, టి.వెంకట్రావు, టి.విజయచంద్ర, పునాటి శివ కిరణ్, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వట్టిచెరుకూరులో కేక్ కట్ చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

మూడో రోజు ఒక్క నామినేషన్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 20: మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మూడో రోజైన శనివారం ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. నవతరం పార్టీ తరపున రావు సుబ్రహ్మణ్యం ఇప్పటికే రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేయగా, శనివారం మూడో సెట్ సమర్పించారు. మొత్తంగా ఇప్పటివరకు మంగళగిరి అసెంబ్లీ స్థానానికి సంబంధించి 15మంది అభ్యర్థుల నుంచి 21 నామినేషన్లు దాఖలైనట్టు జాయింట్ కలెక్టరు, మంగళగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి తెలిపారు.

పటిష్ట బందోబస్తు నిర్వహించాలి : డీఎస్పీ

పెదనందిపాడు, ఏప్రిల్ 20 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెకోపోస్టుల వద్ద సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించాలని డీఎస్పీ మహబూబ్‌బాషా ఆదేశించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల సరిహద్దు చెక్‌పోస్టును శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి, పలు వాహనాలను నేరుగా ఆపి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ నేపథ్యంలో రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల తాయిలాలు మద్యం, నగదు, వస్తువులు తరలిస్తారని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఏవైనా తరలిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఆయన వెంట ట్రెయినీ డీఎస్పీ, ఎస్‌ఐ రాజ్‌కుమార్, ఏఎస్‌ఐ నార్నె శ్రీనివాసరావులు ఉన్నారు.

చింతపల్లిపాడులో తిరుపతమ్మ తిరునాళ్ల

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 20: మండలం పరిధి చింతపల్లిపాడు గ్రామంలోని గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవార్ల తిరునాళ్ల శుక్రవారం గణపతి పూజ, అఖండ జ్యోతి స్థాపనతో ప్రారంభమయ్యాయి. శనివారం ఆదిలక్ష్మి అంకమ్మ తల్లికి బోనాల సమర్పణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 21 ఆదివారం అమ్మవారికి అగ్ని ప్రతిష్ఠ, 22వ తేదీ జలబిందెల మహోత్సవం, సాయంత్రం మల్లెపూలతో సహస్రనామవళి పూజలు, 23వ తేదీ ఉదయం కుంభ హారతి, పొంగళ్ళు రాత్రికి అమ్మవారి పుట్టింటివారు వట్టిచెరుకూరుకు చెందిన కొల్లా కుటుంబాల ఆధ్వర్యంలో కుంకుమబండ్లతో వచ్చి సమర్పించడంతో 24వ తేదీ సాయంత్రం దివ్య రథోత్సవంతో తిరునాళ్ల ముగుస్తుందని దేవస్థానం కమిటీ వెల్లడించారు.

పశ్చిమ డెల్టాకు 916 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఏప్రిల్ 19: కృష్ణా పశ్చిమ డెల్టాకు 916 క్యూసెక్కుల నీటిని శనివారం విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజి వద్ద 7.5 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి కాల్వ 853 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

అధికార పార్టీ ప్రలోభాలకు గురిచేసినా కూటమిదే విజయం

- పొన్నూరు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



పూజల్లో పాల్గొన్న ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తదితరులు

పెదనందిపాడు, ఏప్రిల్ 20: వైసీపీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజలను ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం తథ్యమని పొన్నూరు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండలపరిధిలోని నాగులపాడులోని స్వయంభూ శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని శనివారం ఆయన దర్శించుకున్నారు. అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధూళిపాళ్ళ మాట్లాడుతూ ఈ నెల 24న పొన్నూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా తొలిసారిగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆశీస్సులు తీసుకోవడం తమకు ఆనవాయితీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, పార్టీ గ్రామఅధ్యక్షుడు బండి నాగబాబు, టీడీపీ నాయకులు పాటిబండ్ల మురళి, కన్నెగంటి చలమయ్య, లావు సత్యం, ఆళ్ళ రాజారావు, ఆళ్ళ ఫణిబాబు, పాటిబండ్ల నాగరాజు, గొల్లపూడి వాసు, ఈదర నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావు కుటుంబానికి పరామర్శ

పెదనందిపాడు, ఏప్రిల్ 20: ఇటీవల వైసీపీ రౌడీ మూకల దాడిలో గాయపడిన నాగులపాడు గ్రామానికి చెందిన టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ నేత, మాజీ ఉపసర్పంచ్ కలవకూరి వెంకట్రావును, కుటుంబసభ్యులను శనివారం పొన్నూరు మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పరామర్శించారు.

ఈ సందర్భంగా దాడి ఘటన వివరాలను వెంకట్రావును అడిగి తెలుసుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచా రౌడీయిజం రాజ్యమేలుతుందని, రాష్ట్రంలో యువతకు ఉపాధిలేకపోవడంతో మత్తుకు బానిసలై ఆర్థిక నేరాలకు పాల్పడుతూ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారన్నారు. దాడికి తెగబడినవారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వెంకట్రావు కుటుంబానికి న్యాయం జరిగే వరకు టీడీపీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని నరేంద్ర తెలిపారు.

దుష్టపాలనను అంతం చేయాలి

- నియోజకవర్గ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్



వసంతనగర్‌లో టీడీపీ ప్రచారసభలో పాల్గొని మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, ఏప్రిల్ 20: రాష్ట్రంలో వైసీపీ దుష్ట పాలనను ఓట్ల ద్వారా అంతం చేయాలని తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం ఫిరంగిపురంలోని వసంతనగర్, అల్లంవారిపాలెం, ఆరోగ్యనగర్ కాలనీలో టీడీపీ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందాగా ఉన్నాయన్నారు. పేదలకు విద్యా వసతి, విద్యా దీవెనలు అసంపూర్తిగా ఇచ్చి వారి చదువులు సత్తుబండలు చేశారని, ఆయన విమర్శించారు. అంబేద్కర్ విదేశీ విద్యను జగన్ విద్యగా మార్చి నిధులు మంజూరు చేయకుండా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. అనేక రకాలుగా దళితులకు విద్యను దూరం చేశారన్నారు. రాష్ట్రంలో జరిగే అరాచకాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, శిరోముండనాలు, అక్రమ నిర్బంధాలను ప్రశ్నించే వారిపై దమన కాండ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఓడించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కొత్తపల్లి కోటేశ్వరరావు, కే యోహాన్, కటికల రామకోటేశ్వరరావు, కే అప్పారావు, కే కొండలు, పీ లూర్దయ్య, కే రాములు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రాన్ని ముంచేశారు

- తాడికొండ దీక్షా శిబిరంలో రైతులు, మహిళలు



తాడికొండ దీక్షా శిబిరం వద్ద కేక్ కట్ చేస్తున్న మహిళలు, రైతులు

తాడికొండ, ఏప్రిల్ 20: సీఎం జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రాన్ని నట్టేట ముంచేశారని రైతులు, మహిళలు అన్నారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, రాజధాని రైతులకు మద్దతుగా, బిల్డ్ అమరావతి పేరిట తాడికొండలో రైతులు, మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పుట్టిన రోజు సందర్భంగా దీక్షా శిబిరం వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లడుతూ ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ఆలజడులు సృష్టించటానికి సీఎం మూడు రాజధానుల ప్రకటన చేశారన్నారు. ప్రకటన వెలువడిన తరువాత రాష్ట్రంలోని అన్ని రంగాలు, వ్యవస్థలు మూలనపడ్డాయన్నారు. ప్రకృతి సంపదను దోచుకోవడానికి విశాఖకు రాజధానిని తరలిస్తున్నామని మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రకటనలు చేయించి రాష్ట ప్రజలను గందరగోళ పరిస్థితుల్లోకి తీసుకువెళ్లారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

50 మంది వలంటీర్ల రాజీనామా



పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలను సమర్పిస్తున్న వలంటీర్లు

కాకుమను, ఏప్రిల్ 20: కాకుమాను మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్లుగా విధులు నిర్వహిస్తున్న 50 మంది రాజీనామా చేసి పత్రాలను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు శనివారం అందజేశారు. కాకుమాను సచివాలయం -1 పరిధిలో 16 మంది, 2 పరిధిలో 18 మంది, చిన్నలింగాయపాలెం సచివాలయ పరిధిలో ఇద్దరు, కొమ్మూరు గ్రామ సచివాలయ పరిధిలో 14 మంది వలంటీర్‌లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. రాకీయ ఒత్తిళ్ల వల్లనే రాజీనామాలు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

66 వేల నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

తుళ్లూరు, ఏప్రిల్ 20: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసుల చెకింగ్‌లు రాజధాని అమరావతిలో అధికమయ్యాయి. అందులో భాగంగా శనివారం ఉదయం రాయపూడి వైజెక్షన్ వద్ద నర్సరావుపేట మండలానికి చెందిన శింబడి సాంబశివనాయుడు కారులో వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. సాంబశివ నాయుడి వద్ద ఉన్న రూ.66వేలు స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదుకు సంబంధించి ఎటువంటి పత్రాలు లేనందువల్ల స్వాధీనం చేసుకున్నట్లు తుళ్లూరు సీఐ సుభాని తెలిపారు. డీఎస్పీ అశోక్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికల ఫ్లైయింగ్ టీంల సంయుక్త తనిఖీల్లో ఈ నగదును స్వాధీనం చేసుకొని ట్రెజరీకి పంపినట్లు తెలిపారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త ఉమాయాదవ్ మృతి

దుగ్గిరాల ఏప్రిల్ 20: టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ వార్డు సభ్యుడు తుల్లిమిల్లి ఉమాశంకర్ యాదవ్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. పార్టీ సీనియర్ కార్యకర్తగా తుది శ్వాస వరకూ కొనసాగిన ఉమాయాదవ్ మృతదేహానికి పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

ఘనంగా సాయి మందిర 74వ వార్షికోత్సవం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 20: బోసురోడ్డులోని స్వరాజ్ టాకీసు వద్ద శ్రీషిరిడి సాయిబాబా మందిరం 74వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రాలో మొట్టమొదటిగా బాబా మందిరం నెలకొల్పడం విశేషం. భక్తులు వార్షికోత్సవంలో పాల్గొని ఆశీస్సులు పొందాలని మందిర సేవా సమితి అధ్యక్షుడు బాలదుర్గా ప్రసాద్ కోరారు.

తెలుగుదేశం హయాంలోనే ముస్లింలకు లబ్ధి

- మంగళగిరిపాడులో ముస్లిం నేతల ఇంటింటి ప్రచారం



మంగళగిరిపాడులో ప్రచారం నిర్వహిస్తున్న ముస్లిం నాయకులు

మేడికొండూరు ఏప్రిల్ 20: తెలుగుదేశం హయాంలోనే ముస్లింలకు లబ్ధి చేకూరిందని మండలంలోని మంగళగిరిపాడులో ముస్లిం నేతలు శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నపుడు ముస్లిం మైనార్టీలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వధూవరులకు దుల్హన్ పథకం కింద లక్ష రూపాయలు, చంద్రన్న బీమా కింద పది లక్షల రూపాయలు, విదేశీ విద్యాపథకంతో పాటు సబ్సిడీ రుణాలు, రంజాన్ తోఫా వంటి పథకాల ద్వారా అనేక మంది ముస్లింలు లబ్ధిపొందారని, అటువంటి పథకాలు తిరిగి అమలు కావాలంటే రానున్న ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. టీడీపీ మైనార్టీ నాయకులు అబ్దుల్ ఘని, షేక్ తోఫిక్, షేక్ ఖాజా గులామ్, షేక్ ఖాజావలి, షేక్ దావూద్, షేక్ అమానుల్లా, షేక్ హజరత్, షేక్ అబ్దుల్ కరీం తదితరులతో పాటు ముస్లిం మత పెద్దలు. మహిళలు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.



చంద్రబాబు జన్మదిన కేక్ కట్ చేస్తున్న జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, వీరవల్లి మురళి, నాగభూషణం, రామకృష్ణ తదితరులు

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే నాయకుడు చంద్రబాబు

● చంద్రబాబు జన్మదిన వేడుకల్లో నాదెండ్ల మనోహర్



కేక్‌ను కట్ చేస్తున్న నరేంద్రకుమార్ తదితరులు

తెనాలి (మారీసుపేట), ఏప్రిల్ 20: రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి ఆంధ్రప్రదేశ్‌ను నవ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే నాయకుడు మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అని కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బోసురోడ్డులోని జనసేనపార్టీ కార్యాలయంలో గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ నాయకులు వీరవల్లి మురళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా మనోహర్ మాట్లాడుతూ తెలుగు ప్రజలు గర్వించదగ్గ వ్యక్తి నారా చంద్రబాబునాయుడన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రాష్ట్రంలో తిరిగి అందరూ సంతోషంగా ఉండే పాలన రావాలంటే ముందుచూపున్న నాయకుడు చంద్రబాబును తిరిగి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఉమ్మడి పార్టీల అభ్యర్థులందరూ కలిసికట్టుగా ఉంటూ రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని కోరారు. గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నాయకత్వంతోనే అన్నివర్గాల ప్రజలకు మంచి జరగనుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అంగలకుదురు గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, సూరపనేని నాగేశ్వరావు, కన్నెగంటి మురళీకృష్ణ, ఈదర వెంకట పూర్ణచంద్, పావులూరు రాంబాబు, అన్నాబత్తుని జయలక్ష్మి, పెమ్మసాని రాజ్యలక్ష్మి, ఘట్టమనేని రామకృష్ణ, తాడిబోయిన శ్రీనివాసరావు, కోగంటి శివశంకరావు, బీజేపీ నాయకులు పాటిబండ్ల రామకృష్ణ, వాసుదేవ నాయుడు, తోటకూర వెంకట రమణరావు, హరిదాసు గౌరి, సుబ్రమణ్యం, రమాకాంత్, నన్నపనేని రాంబాబు, కరేటి వాసు, ఎల్ఎంఎల్ ఖాదర్, విష్ణు, గణేష్ యూత్ సభ్యులు, ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో...

తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చంద్రబాబు జన్మదిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● రాష్ట్ర వాణిజ్యవిభాగ అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్ ఆధ్వర్యంలో తెనాలి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈదర వెంకట పూర్ణచంద్ పలువురు పార్టీ నాయకులతో కలిసి చంద్రబాబు జన్మదిన కేక్‌ను కట్‌చేసి అధినాయకుడికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అన్నాబత్తుని జయలక్ష్మి, అన్నాబత్తుని శ్రావణ్‌కుమార్, కన్నెగంటి మురళీకృష్ణ, ఈదర శ్రీనివాసరరావు, కాకుమాను ఉపేంద్ర,మునిపల్లె దుర్గప్రసాద్, గుమ్మడి ప్రసాద్, కొండా రాము, పుల్లారావు, రాఘవేంద్రరావు, తాజ్‌భాష తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని శివాజీచౌక్‌లో మాజీ ముఖ్యమంత్రి టీడీపీ అధినేత నారా చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజుకేక్‌ను పార్టీ శ్రేణులతో కలిసి శుభాకాంక్షలు తెలిపుకున్నారు. కార్యక్రమంలో తుల్లిమిల్లి బాలకృష్ణ, ధూళిపాళ్ల కార్తిక్, షేక్ కరిముల్లా, శివగోపి, హరికృష్ణ, రామయ్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగలకుదురులో ప్రత్యేక పూజలు

తెనాలి రూరల్, ఏప్రిల్ 20: నారా చంద్రబాబు నాయుడు జన్మదినంను పురస్కరించుకుని అంగలకుదురు టీడీపీ సీనియర్ నాయకులు, హెచ్‌సీవీ ఎండీ కరణం వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, గ్రామ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గ్రామంలోని శివాలయంలో స్వామివారిని దర్శించుకుని టెంకాయలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరరావు, గ్రామ సర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి, నలుకుర్తి విజయ, అలపర్తి సుధాకర్, జాలాది సిద్ధయ్య, శ్రీపతి రాజేష్, తిరుమలేష్, చెన్నుపాటి లక్ష్మయ్య, గ్రామ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను శనివారం టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కేక్‌కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావటానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలతో పాటు, జనసేన పట్టణ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, యన్నం నాయుడు, పున్నారావు, డి.సూర్య తదితరులు పాల్గొన్నారు.

● పెదకాకాని: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 74వ జన్మదినం సందర్భంగా శనివారం పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో అన్నదానం

పెదకాకాని, సెప్టెంబరు 20: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ సమీప గ్రామమైన నంబూరులోని పేద విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టి.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షుడు బి.హేమంత్ కుమార్, ఉపాధ్యక్షులు డి. శిరీష్, ట్రెజరర్ వి.గోపి, సహాయ కార్యదర్శి ఆర్.హరీష్, అధికార ప్రతినిధి గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల సమయంలో అప్రమత్తత అవసరం



అగ్నిమాపక యంత్రాలను ప్రదర్శిస్తున్న సిబ్బంది

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 20: ప్రమాదాల సంభవించిన సమయంలో అప్రమత్తతతో ఉండి నష్ట నివారణ చేయవచ్చని ఫైర్ అధికారి కె.ప్రసాదరావు అన్నారు. శనివారం పట్టణంలోని ఫైర్ స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అగ్నిమాపక యంత్రాల ప్రదర్శన నిర్వహించి వాటి పనితీరుపై పాఠశాల విద్యార్థులు, పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు, ఆర్టీసీ మేనేజర్ అజిత, పాఠశాలల విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఒక నామినేషన్ దాఖలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 20: శాసనసభ ఎన్నిక కోసం శనివారం మూడో రోజు ఒక నామినేషన్ దాఖలైంది. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా జొన్నాదుల రమేష్ ఒక సెట్ నామినేషన్‌ను ఎన్నికల అధికారి ఎ.లక్ష్మీకుమారికి అందజేశారు.

చెక్ పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీలు



చెక్ పోస్టును పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు రాంనాథ్ పురోహిత్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 20: ఎన్నికల నేపథ్యంలో పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు, చేబ్రోలు మండలంలోని నారాకోడూరు వద్ద ఏర్పాటు చేసిన తనిఖీల చెక్ పోస్టును ఎన్నికల వ్యయపరిశీలకుడు రాంనాథ్ పురోహిత్ ఆకస్మిక తనిఖీ చేశారు. చెక్ పోస్టులలో ఉండే సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీచేసి పంపాలని ఆదేశించారు. ఎన్నికల్లో నగదు, మద్యం నివారణ లక్ష్యంగా ఈ చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సిబ్బంది పనితీరుపై సూచనలు ఇచ్చారు. ఈ తనిఖీలలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మ్యానిఫెస్టోల్లో సినీ పరిశ్రమ అభివృద్ధికి చోటు ఇవ్వాలి

● సినీ దర్శకుడు దిలీప్‌రాజా

తెనాలి అర్బన్, ఏప్రిల్ 20: రాజకీయ పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలో రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధి చోటు ఇవ్వడం లేదని సినీ దర్శకుడు దిలీప్‌రాజా ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ, ఇప్పటివరకు దీనిపై స్పష్టత లేకపోవడం చూస్తే పరిశ్రమ అభివృద్ధిపై ఉన్న నిర్లక్ష్యం కనబడుతుందన్నారు. వినోద పన్ను రూపంలో ఆదాయం తెస్తున్న సినీ రంగంపై వివక్ష చూపకుండా పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక ప్రకటించాలని కోరారు. పరిశ్రమ అభివృద్ధికి పాటుపడే వారిని ఎన్నికల్లో ఆదరించాలని మా ఏపీ సభ్యులను సినీ సాంకేతిక సిబ్బందిని కోరారు.

తోపుడు బండి అందజేత



చిరువ్యాపారులకు తోపుడు బండిని అందిస్తున్న కరణం, మాజీ ఎంపీపీ వెంకట్రావు తదితరులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 20: గ్రామంలో అద్దెబండితో చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు, హెచ్‌సీవీ అధినేత కరణం వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావులు భరోసాగా నిలిచారు. శనివారం మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని రూ. 25వేలు విలువ గలిగిన తోపుడు బండిని కరణం వెంకటేశ్వరరావు, సూర్యదేవర వెంకట్రావులు అందించారు. కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ ఊసరపు రాజ్యలక్ష్మి, గ్రామపార్టీ ప్రెసిడెంట్ కనగాల శ్రీనివాసరావు, అలపర్తి సుధాకర్, జె.దుర్గభవాని, జె.లక్ష్మయ్య, రాంబాబు, ఉరిటి శ్రీనివాసరరావు, జె.సిద్దయ్య రాజేష్, చైతన్య సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆరోపణకు సమాధానం చెబుతా

● ప్రజల కోసం ఎన్నిసార్లయినా జైలుకు వెళతా ● ఐదేళ్లలో ఒక్క ఆరోపణ నిరూపించారా? ● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 20: నామినేషన్లు వేసిన నాటి నుంచి వైసీపీ అభ్యర్థి చేసిన ప్రతి ఆరోపణలకు సరైన సమాధానం చెబుతానని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తెలిపారు. శనివారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పొన్నూరు పురపాలక సంఘంలో టీడీపీ, జనసేన నాయకులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రతి వ్యక్తిని కలిసి సమస్యలు అడిగి తెలుసుకోవటంతో పాటు, సూపర్-6 పథకాలను ప్రచారం చేసినట్లు చెప్పారు. పురపాలక సంఘ ప్రజలు తాగునీటి ఎద్దడితో సతమతమవుతున్నట్లు చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యే తాగునీటి చెరువు యంత్రాల మరమ్మతుల్లో కూడా కమీషన్లులకు కక్కుర్తిపడితే కాంట్రాక్టర్ పని వదిలివెళ్లిపోవటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. చేబ్రోలులో ఎటు చూసినా తాగునీటి ఎద్దడే కనిపిస్తోందన్నారు. ఉప్పలపాడులో తాగునీటి కోసం టీడీపీ హయాంలో రూ.2.73 కోట్లు మంజూరు చేయించి పథక నిర్మాణం చేపట్టామన్నారు. పది అడుగుల అనుసంధాన పైప్‌లైన్ వేస్తే గ్రామానికి నీరు వచ్చేవన్నారు. 4 ఏళ్ల 10నెలల కాలం పది అడుగుల పైప్ లైన్ వేయటానికి వైసీపీ పాలకులకు సమయం సరిపోలేదని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రతినిధి వైసీపీ నాయకులు కమీషన్ల కోసం అభివృద్ధి పనులు చేశారే తప్ప ప్రజలకు అవసరమైన ఒక్క పని కూడా చేయలేదని దుయ్యబట్టారు. జగన్ పత్రికలో నిరాధారమైన వార్తలు రాసిన వాటిపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఎన్నికల సంఘానికి జగన్ పత్రికపై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వైసీపీ అభ్యర్థి చరిత్ర తమ వద్ద ఉందన్నారు. ఆయన నామినేషన్ వేసిన నాటి నుంచి ఆయన, ఆయన సోదరుడు అంబటి రాంబాబు చేసిన దౌర్జన్యాలు దోపిడీలు ప్రజల ముందు ఉంచుతామని హెచ్చరించారు. ఎన్నికల అధికారులు కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. వైసీపీ అభ్యర్థి ప్రతిరోజూ భారీఎత్తున టెంట్‌లు వేసి భోజనాలు సరఫరా చేసి కార్యక్రమాలు నిర్వహిస్తుంటే వాటిని లెక్కించని అధికారులు ప్రతిపక్షంలో ఉన్న తాము టీ తాగినా, టీ గ్లాస్, తాగునీటి గ్లాసుల నుంచి లెక్కింపులు చేస్తున్నారని ఆరోపించారు. జైలుకు వెళ్లిన అంశంపై మాట్లాడుతూ ప్రజల కోసం ఎన్నిసార్లు అయిన జైలుకు వెళతానని సమాధానం ఇచ్చారు. సంగం డెయిరీపై, భూములపై ఆరోపణలు చేస్తున్న వైసీపీ అభ్యర్థి తన పార్టీ అధికారంలో ఉన్న 4 ఏళ్ల, 10 నెలల కాలంలో ఒక ఆరోపణ కూడా ఎందుకు నిరూపించలేకపోయారని ప్రశ్నించారు. తాను ప్రకటించిన ఆస్తులు కాకుండా ఏమున్నా వైసీపీ నాయకులు తీసుకోవచ్చన్నారు. అలాగే పొన్నూరు ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఎన్నికల మ్యానిఫెస్టో కూటమి అభ్యర్థుల ఆధ్వర్యంలో త్వరలోనే ప్రకటించనున్నట్లు చెప్పారు. సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి పాటుపడతా: ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 20: రజకుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని నిడుబ్రోలులో రజక సేవా సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నరేంద్ర కుమార్‌కు స్వాగతం పలికారు. అనంతరం రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నరేంద్ర హామీ ఇచ్చారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కొల్లిపర, ఏప్రిల్ 20: మండల పరిధిలోని మున్నంగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు రాము ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణతో పాటు నృత్య పోటీలు, దేశభక్తిగేయాలు, నాటికలను ప్రదర్శించారు.

జూదరుల అరెస్టు.. రూ.65,500 స్వాధీనం

తెనాలి రూరల్, ఏప్రిల్ 20: నేలపాడు శివారు పంట పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్లు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం తెల్లవారు జామున ఎస్ఐ కోటేశ్వరరావు, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.65,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇప్పటివరకు మూడే నామినేషన్లు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 20: తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికకు శనివారం నామినేషన్లు దాఖలు కాలేదు. శుక్రవారం మూడు నామినేషన్లు మాత్రమే దాఖలు అయ్యాయి. అభ్యర్థులు ముందుగానే ఖరారు అయినప్పటికీ మంచి ఘడియల కోసం ఎదురు చూస్తున్నారు.

ఘనంగా సాయి మందిర 74వ వార్షికోత్సవం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 20: బోసురోడ్డులోని స్వరాజ్ టాకీసు వద్ద శ్రీషిరిడి సాయిబాబా మందిరం 74వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రాలో మొట్టమొదటిగా బాబా మందిరం నెలకొల్పడం విశేషం. భక్తులు వార్షికోత్సవంలో పాల్గొని ఆశీస్సులు పొందాలని మందిర సేవా సమితి అధ్యక్షుడు బాల దుర్గా ప్రసాద్ కోరారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి

● ఎన్నికల ప్రచారంలో నాదెండ్ల మనోహరం, రాజ్యలక్ష్మి

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 20: రానున్న ఎన్నికలలో రాష్ట్రాభివృద్ధికై టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులైన నాదెండ్ల మనోహర్‌ను, పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించండని నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం, పెమ్మసాని చంద్రశేఖర్ సోదరి పెమ్మసాని రాజ్యలక్ష్మి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని 8వ వార్డు నాజరుపేటలో ఇంటింటికి తిరుగుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థులైన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్ గ్లాసు గుర్తుకు, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌కు సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రజలందరూ ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, చాట్రగడ్డ అంజనేయులు, డాక్టర్ వేమూరి శేషగిరావు, మురళి, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 20: అక్రమ మద్యం విక్రేయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన్నట్లు అర్బన్ ఎస్ఐ ఎం రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం బాపట్ల బస్టాండ్ వద్ద నిర్వహించిన సోదాలలో ఇటికంపాడు గ్రామానికి చెందిన జె కోటేశ్వరరావు అనే వ్యక్తిని అధుపులోకి తీసుకొని అతని నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ వివరించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 20: తెనాలి జైన్ సంఘం ఆధ్వర్యంలో 121మంది పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. భగవాన్ మహావీర్ గ్రూప్ పర్యవేక్షణలో జైన దేవాలయంలో ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువైన సరుకులు అందించారు.

నేడు కళల కాణాచి నాటకం 'గో టు హెల్'

తెనాలి అర్బన్, ఏప్రిల్ 20: కళల కాణాచి వేద గంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినీ రచయిత, నటుడు గొల్లపూడి మారుతీరావు రచించిన సాంఘిక నాటకం గో టు హెల్ తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం ప్రదర్శించనున్నారు. నాటక కరపత్రాలను సంస్థ సభ్యులు శనివారం విడుదల చేశారు. ప్రైడ్‌ఆఫ్ తెనాలి పురస్కారం ప్రదానోత్సవం నిర్వహిస్తామని సినీరచయిత బుర్రా సాయిమాధవ్ చెప్పారు.

డాక్టర్ హరితకు మోహన్‌దాస్ స్మారక గోల్డ్ మెడల్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 20: విజయవాడకు చెందిన మహిళల వైద్య నిపుణురాలు డాక్టర్ హరితకు డాక్టర్ కొడాలి మోహన్‌దాస్ స్మారక గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. ఐఎంఏ హాలులో శనివారం రాత్రి మోహన్‌దాస్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెనాలి వైద్య రంగంలో ఆయన అందించిన సేవలు పలువురు వైద్యులు గుర్తు చేశారు.

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు

10 వేల మందికి అన్నదానం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 20: పట్టణంలోని హనుమాన్ చౌక్‌లో ఈ నెల 9 నుంచి నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాలు శనివారం ముగిశాయి. శ్రీసీతారామ మందిరంలో రవిశంకర్, శశికళ దంపతులు స్వామి వారి పవళింపు సేవ నిర్వహించడంతో ఉత్సవాలు పూర్తయ్యాయి. ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, కమిటీ కార్యదర్శి సూర్యనారాయణమూర్తి, శాస్త్రి తదితరులు ముగింపు పూజల్లో పాల్గొన్నారు. 10వేల మంది భక్తులకు అన్నదానం చేసింది. ఉగాది నుంచి ఇక్కడ ప్రారంభమైన ఉత్సవాలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులంతా సంఘంగా ఏర్పడి ఈ సేవ నిర్వహిస్తున్నారు. సంఘం అధ్యక్షుడు దొప్పలపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, నరసింహారావు, అరుణ్‌కుమార్, బాలాజీ, రాధాకృష్ణమూర్తి, బాలగోపాల్, రంగారావు, కృష్ణారావు, శ్రీనివాసరావు, నాంచారయ్య తదితరులు అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బ్యాంకు సీఈవో టి.కృష్ణవేణి, జీఎం మాధవి, వీజీఎం జయలక్ష్మి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలాజీరావుపేట పట్టాభి రామస్వామి ఆలయంలో కూడా కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. గాడిబావి సెంటర్‌లోని శ్రీసీతారామాంజనేయ స్వామి మందిరంలో స్వామివారి ఏకాంత సేవ నిర్వహించారు. పుష్పశయనోత్సవం కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో అమర్‌నాథ్, అర్చకులు గురునాథప్రసాద్‌శాస్త్రి పర్యవేక్షించారు.

అమృతమూర్తికి అశ్రునివాళి



జననం : 22-07-1955

మరణం : 11-4-2024

కీ॥శే॥ దావులూరి వెంకటేశ్వరరావు గారు

పెదరావూరు, తెనాలి మండలం

ప్రేమ, ఆప్యాయతానురాగాలు మాకు పంచి, కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి,
మా అందరి హృదయాలలో సుస్థిరస్థానాన్ని సంపాదించి,
మీరు మా నుండి భౌతికంగా దూరమైననూ... మీ జ్ఞాపకాలు స్మరించుకుంటూ...
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : దావులూరి శివపార్వతి
తల్లి : దావులూరి అనసూర్యమ్మ

కుమారులు - కోడళ్ళు :
దావులూరి మనోజ్ కుమార్ - మేఘున
దావులూరి కృష్ణకళ్యాణ్ - సంధ్యారాణి
మనుమరాలు : బేబి హంసిని కృష్ణ దావులూరి

తమ్ముడు : దావులూరి సుబ్బారావు
కుమార్తె - అల్లుడు : నల్లూరి సౌజన్య - సుధీర్
కుమారుడు - కోడలు : దావులూరి శ్రీధర్ - శ్రావణి

పెదకర్మ : ది. 21-4-2024 ఆదివారం ఉదయం 9 గంటలకు తెనాలి మండలం, పెదరావూరులోని మా స్వగృహం నందు జరుగును,
వైకుంఠ సమారాధన : ది. 21-4-2024 ఆదివారం ఉదయం 11 గంటలకు పెదరావూరులోని శ్రీలక్ష్మి కళ్యాణ మండపం నందు జరుగును. కావున తెలియజేయటమైనది.